



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్

నిసార్ హుషార్

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మందిదాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్యాహ్నమే షార్‌కు తరలి వచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజాము నుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ నింగికెగిరినంతరం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

● సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలం చెందింది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడుతుంది.



ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు

● రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ ఛైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ ఛైర్మన్లు డాక్టర్ కె,రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరిలో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.



చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా ఘన విజయం.

- వీ.నారాయణన్, ఇస్రో ఛైర్మన్



వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పాల్గొన్న డీఏవో సత్యవాణి, తదితరులు

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే

ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను మేళవించి, రైతులకు లాభసాటిగా తయారుచేయ డమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో బుధవారం అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా తీసుకువచ్చే వ్యవసాయ మార్పులపై వ్యవసాయ అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిస్టాక్ అనేది రైతు రిజిస్ట్రీ, జియోరిఫరెన్స్ విలేజ్ మ్యాప్, క్రాప్ సోన్ రిజిస్ట్రీతోసహా ముఖ్యమైన వ్యవసాయ డేటాసెట్‌లను ఏకీకృతం చేసే సమాఖ్యని తెలిపారు. ఇది యూనిఫైడ్ ఫార్మర్ సర్వీస్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఏకీకృతం చేయబడు తుందని, బ్యాంకులు, బీమాసంస్థలు, వ్యవసాయ సాంకేతిక సంస్థలు, ప్రభుత్వ విభాగాలతోసహా వాటాదారుల మధ్య సజావుగా డేటా భాగస్వామ్యాన్ని అనుమతిస్తుందని వివరించారు. తద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెంచుకోవడమే కాకుండా మార్కెటింగ్ సదుపాయాలు కూడా విస్తృత పరచుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్ప, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో

నేడు మహా కుంభాభిషేకం

● కనుల పండువగా అధివాసాలు



ప్రతిష్ఠ ఉత్సవాల్లో కలశాలు

నెల్లూరు (సాంస్కృతి కం), జూలై 30 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి విమాన గోపుర మహా కుంభాభిషేకం, నవగ్రహ విగ్రహ పునఃప్రతిష్ఠ గురు వారం జరగనున్నాయి. మూడు రోజులుగా జరు గుతున్న ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాగణపతిపూజ, యాగశాల ప్రదక్షిణం, విశేష పూజలు, హోమాలు, వేద పారాయణ జరిగాయి. సాయంత్రం ప్రతి ష్ఠామూర్తుల రథయాత్ర, అధివాసాంగ హోమాలు, ఉపనిషత్ పారాయణం జరిగాయి. అనంతరం నిర్వహించిన పుష్పాధివాసం, శయ్యాధివాసం భక్తులకు కనువిందు చేశాయి. కంచిపీఠం ఆస్థాన పండితుడు ఎల్ విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి శిష్య బృందం, రాజరాజేశ్వరి ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. దాతలు ఆల్తూరు మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, ఆలయ ఈవో, దేవదాయ శాఖ ఏసీ కోవూరు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

చర్చ సాగకనే...

- మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం
- 132 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం
- చేసిన పనుల ఆమోదానికే అన్నట్లుగా నిర్వహణ
- తప్పుబట్టిన పలువురు కార్పొరేటర్లు

నెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశమంటే... స్థానిక సమస్యలపై చర్చలు... అభివృద్ధి పనుల ఖర్చులపై లెక్కలు... తదితర అంశాలు గుర్తుకొస్తాయి.... కానీ బుధవారం నిర్వహిం చిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఇందుకు భిన్నంగా సాగింది. ఒక్కటంటే ఒక్క అజెండా అంశంపై కూడా చర్చ లేకుండానే ముగిసింది. జరిగిపోయిన పనులను ఆమోదించుకునేందుకు సమా వేశం ఏర్పాటు చేసినట్లుగా ఉంది. ప్రధాన అజెండాలో 111 అంశాలు, సప్లమెంటరీ అజెండాలో 6 అంశాలు, టేబుల్ అజెండాలో 15 అంశాలను కౌన్సిల్ ముందుంచారు. ప్రధా న అజెండాలోని అన్నీ అంశాలూ ర్యాటిఫి కేషన్(ధ్రువీకరణ)కు సంబంధించి నవే కావడం గమనార్హం. అంటే ఈ పను లు, నిర్ణయాలు ఇదివరకే జరిగిపోయాయి. ఇప్పుడు నామమాత్రంగా వాటిని ఆమో దించేలా అధికారులు అజెండా రూపొందించారు.

● కార్పొరేటర్ల అభ్యంతరం

కౌన్సిల్ అజెండాపై సమావేశంలో పలువురు కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అజెండా మొత్తం ర్యాటిఫికేషన్ అంశాలే ఉండడం తానెప్పుడూ చూడలేదని, రాష్ట్రంలో ఎక్కడా ఇలా జరిగి ఉండదని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ వ్యాఖ్యానించారు. కౌన్సిల్‌లో చర్చించకుండానే పనులు చేసేసి, ఆ తర్వాత కౌన్సిల్‌లో పెట్టడం ఏం పద్ధతని నిలదీశారు. ఇదే తీరున కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, కిన్నెర మాల్యాద్రి కూడా ప్రశ్నించారు. అజెండాలో చర్చించే అంశాలే లేనప్పుడు ఇక తామెందుకంటూ కొందరు కార్పొరేటర్లు కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు.



సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి

కాగా ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం ఒకటన్నర గంటలోనే ముగిసింది.

● మాట్లాడింది కొద్దిమందే..

సమావేశంలో 54మంది కార్పొరేటర్లతోపాటు పలువురు కోఆప్షన్ సభ్యులుండగా, వారిలో కొద్దిమంది మాత్రమే మాట్లాడారు. వారంతా స్థానిక సమస్యలను ప్రస్తావించారు. వెంకటేశ్వరపురంలోని టిడ్కో ఇళ్ల వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాల్ అద్దె తగ్గించాలని, నగరంలోని కొన్ని సచివాలయాల పరిధిలో శానిటేషన్ సిబ్బంది కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. బోడిగాడితోట శ్మశాన వాటికలో రాత్రి ఏడు దాటితే అంత్యక్రియలు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థలోని కొందరు వ్యక్తులు ఆప్కాస్ కింద ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బు లు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని విచారించా లని డిప్యూటీ మేయర్ తహసీన్ కోరారు. నగరపాలక సంస్థ లో ఒక సర్వే రిపోర్టు తీసుకోవాలంటే సామాన్యుడికి రూ.25 వేలు ఖర్చవుతోందని ఈ దోపిడీని అరికట్టాలని మరికొందరు కోరారు. కాగా కార్పొరేషన్‌లో గతంలో జరిగిన ఫోర్జరీ సంతకాల వ్యవహారం ఏమైందని, అక్రమ లేఅవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి ప్రశ్నించారు.

● అధికారుల స్పందనేదీ ?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారుల స్పందన సున్నాగా ఉందని కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆరోపించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జనసేన తరఫున ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులకు తాము ఫోన్లు చేసి చెప్పినా స్పందించడం లేదని ఆరోపించారు. టిడ్కో గృహాలపై అధికారులు దృష్టి సారించి, వేగవంతంగా లబ్ధిదారులకు అందజేయాలని ఆయన కోరారు.

● రూ.43.72 కోట్ల పనులకు ఆమోదం

కౌన్సిల్ సమావేశం ముగిశాక మేయర్ స్రవంతి మీడియాతో మాట్లాడారు. మొత్తం 132 అజెండా అంశాలను సభ్యులంతా ఆమోదించినట్లు తెలిపారు. నగరంలో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10.36 కోట్లతో ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థ స్థలాలకు కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు రూ.5.37 కోట్లు, పారిశుధ్య పనుల్లో హైడ్రాలిక్ మిషన్లు, స్వీపింగ్ మిషన్ల కోసం రూ.10.18 కోట్లు, డ్రైనేజీ క్లీనింగ్, పార్కుల అభివృద్ధి, నగర సుందీకరణ కోసం రూ.6.95 కోట్లు, దర్గా అభివృద్ధి కోసం రూ.2.26 కోట్లు, వాహనాల కోసం రూ.2.46 కోట్లు, వీఆర్ హైస్కూల్‌లోని విద్యార్థుల రవాణా కోసం బస్సుల కొనుగోలుకు రూ.5 కోట్లు, గణేష్ ఘాట్ పనుల కోసం రూ.10 లక్షలు కేటాయిస్తూ తీర్మానించగా, కౌన్సిల్ సభ్యులంతా ఆమోదం తెలిపినట్లు ఆమె వివరించారు. మొత్తంగా ఈ సమావేశంలో రూ.43.72 కోట్ల పనులను ఆమోదించినట్లు మేయర్ వివరించారు.

వైసీపీ నేతలకు నోటీసులు

- నిబంధనలు పాటించాలని ఆదేశాలు
- జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు
- నేటి జగన్ పర్యటనకు 900 మందికిపైగా పోలీసుల బందోబస్తు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన ఐజీ



బందోబస్తు అధికారులతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నాటి జిల్లా పర్యటన ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలను పోలీసుశాఖ చేపట్టింది. ఇప్పటికే ముఖ్యమైన వైసీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు. జగన్ పర్యటనలో నిబంధనలు పాటించాలని, జన సమీకరణ చేయరాదని, చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. జగన్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజు ల నుంచి ఆయన జిల్లాలో ఉంటూ అధికారు లకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా బుధవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జిల్లాకు చేరుకున్నారు. జగన్ పర్యటనలో గతంలో పలు జిల్లాలో జరిగిన సంఘటనలు పునారావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.. ఏయే చర్యలు చేపడుతున్నారు...? అనే అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు.

● మాజీ సీఎం పర్యటన ఇలా...

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 10.30 నుంచి 11 గంటల లోపు చెముడుగుంటలోని డీటీసీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్క డ నుంచి పోలీసు అనుమతించిన జెడ్‌ప్లస్ కేటగిరి క్యాన్వాయ్‌తో పాటు నాయకులకు కలిసి మరో మూడు వాహనాల్లో నెల్లూరు సెంట్ర ల్ జైలుకు చేరుకుంటారు. అక్కడ ముగ్గురు నేతలతో కలిసి లోపలికి వెళ్లి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అవుతారు. అనంతరం నగరంలోని మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకుంటారు. ప్రసన్నను పరామర్శించి రోడ్డు మార్గాన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.



వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి నోటీసులు అందించి మాట్లాడుతున్న బాలాజీనగర్ సీఐ సాంబశివరావు

● భారీ బందోబస్తు

జగన్ పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 22 మంది ఇన్‌స్పెక్టర్లు, 891 మంది ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు , కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, హోమ్‌గార్డులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. 10 డ్రోన్ కెమెరాలు, 40కుపైగా సీసీ కెమెరాలతో జగన్ పర్యటన మొత్తం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో లైవ్ ద్వారా అధికారులు పర్యవేక్షిస్తుంటారు. బైక్ ర్యాలీలు, నిరసనలు, ప్రజలు గుంపులుగా ఉండటం, రెచ్చగొట్టేలా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిం చడం... ఇలా నిబంధనలు అతిక్ర మిస్తే చట్టప్రకారం చర్యలు చేప ట్టేందుకు పోలీసులు సన్నద్ధమ య్యారు. కాగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పీ.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసన్న కుమార్‌రెడ్డితో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముఖ్య నాయకులకు పోలీసులు ఇప్పటికే నోటీసులు అందచేశారు.

● బ్రీఫింగ్ నిర్వహించిన ఐజీ

ఈ సందర్భంగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 900 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో మాజీ సీఎంకు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. భద్రతాపరంగా ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అన్నీ చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా పర్యవేక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక బృందాలను నియమించామని ఆయన వివరించారు. జగన్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానంలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్, అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపులో అవకతవకలపై జనసేన ఫిర్యాదు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పొదుపు సంఘాల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడతున్నారని జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ బుధవారం ఏపీవో వనజాక్షికి ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపులలో చెల్లింపుల విషయంలో, ఆన్‌లైన్‌లో లేనివారికి రుణాలు ఇవ్వడంలో, ప్రభుత్వం అనుమతి లేకుండానే సిబ్బందిని మార్చడం, కొత్తవారిని చేర్చడం వలన చాలా అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు జాకీర్, కిరణ్, పెనుబాక మహేష్, జిట్టా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9530
వెండి కిలో ధర	రూ. 117300
వెండి ఒక గ్రాము	రూ. 120.30

జగన్ పర్యటనకు వైసీపీ నేతల సన్నాహాలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన కోసం బుచ్చి మండలం నుంచి తరలివెళ్లేందుకు బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం రోజే కొంతమంది నెల్లూరుకు తరలివెళ్లారు. నగర పంచాయతీ వైసీపీ కౌన్సిలర్లు అధ్వర్యంలో కొంతమంది తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసుల నోటీసులు

బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో 10మంది ప్రధాన నాయకులకు బుధవారం నోటీసులు జారీ చేసినట్టు ఎస్‌ఐ సంతోషరెడ్డి తెలిపారు. గురువారం ఎవరైనా వైసీపీ నాయకులు ఎక్కడా గుంపులుగా తయారు చేయడం, నాయకులు, కార్యకర్తలను తరలించే ప్రయత్నాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, జనాలను ఇబ్బందులకు గురిచేసేలా చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

జన సమీకరణకు అనుమతి లేదు

కోవూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటనకు సంబంధించి జనసమీకరణకు అనుమతి లేదని ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు నగరంలో రెండు చోట్లకు జగన్మోహన్‌రెడ్డి పరామర్శకు అనుమతి ఉందన్నారు. ఇటీవల రాష్ట్రంలో పలు చోట్ల జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా జనం గుమికూడేందుకు, జనసమీకరణకు పోలీసు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదని చెప్పారు. రెచ్చగొట్టే ధోరణిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని చెప్పారు. పోలీసు ఆంక్షలను పాటించాలని కోరారు. వెంకటేశ్వరపురం, సాలుచింతల ప్రాంతంలో జనసమీకరణ అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

వైసీపీ నేతలకు పోలీసుల నోటీసులు

వెంకటాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం జిల్లాకు విచ్చేస్తున్న నేపథ్యంలో బుధవారం మండలవ్యాప్తంగా ఉన్న పలువురు వైసీపీ నేతలకు నోటీసులు అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఎఆర్ దామోదర్ ఆదేశాల మేరకు వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అందచేశారు. జిల్లా పర్యటనలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి చెముడుగుంట సమీపంలోని నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాకత్ కానున్నారు. ఈక్రమంలో సందర్శన, అనుమతిపై విధించిన షరతులను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసీపీ నేతలకు నోటీసులు జారీచేసి ఫోన్ల ద్వారా జనసమూహాలను సమీకరించకుండా ఉండాలని సూచించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ సర్వే

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ సర్వే చేయిస్తుందని, పారిశుధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు వస్తాయని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ చాంబరులో బుధవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, పట్టణంలోని సచివాలయ కార్యదర్శులుతో మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ సర్వేలో రామమూర్తి పేట ఏరియా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తున్నారా, మీకు సమీపంలో చెత్తతో నిండిన చెత్తకుండీలు ఉన్నాయా, డ్రైనేజీలు తీస్తున్నారా తదితర ప్రశ్నలను ప్రజలను అడుగుతున్నారన్నారు. శానిటరీ కార్యదర్శులు తమ ప్రాంతాల్లోని ప్రజలను కూడా చైతన్యపరిచి మీరు చేస్తున్న సర్వీస్‌లకు మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. పారిశుధ్యం మెరుగుదలకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు.

అధ్వానంగా రహదారులు


కంకర తేలిన జెన్‌కో రోడ్డు

● వాహన చోదకుల అవస్థలు

ముత్తుకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు నుంచి నేలటూరులోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముత్తుకూరు నుంచి మామిడిపూడి మీదుగా జెన్‌కో థర్మల్, ఎస్‌ఈఐఎల్ విద్యుత్ కేంద్రాలకు ప్రతిరోజు భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కేంద్రాల్లో పనిచేసే కార్మికులు ఈమార్గంలో విధులకు వెళ్లాల్సి ఉంటుంది. బీసీ కాలనీ నుంచి రిలయన్స్ రోడ్డు కూడలి వరకు వున్న రోడ్డు పలుచోట్ల గుంతలు పడి రాకపోకలకు అణువుగా లేదు. కాస్త వర్షం పడినా ఈ గుంతల్లో నీరు నిలిచి వాహన చోదకులు పలు ఇబ్బందులు గురరవుతున్నారు. మామిడిపూడికి వెళ్లే దారిలో భారీ వాహనాలు వెళ్లే తాకిడిలో గతంలో రెండు వంతెనలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఇసుక దిబ్బల వద్ద ఉన్న వంతెన కూలిపోవడంతో తాత్కాలికంగా బస్తాలు వేసి మరమ్మతు చేసి ఉన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో థర్మల్ కేంద్రానికి వెళ్లే భారీ వాహనాలు కార్మికులను, ఉద్యోగులను తీసుకువెళ్లే ఆటోలు ఈ మార్గంలోనే పయనించాల్సి వస్తోంది. మామిడిపూడి దళితవాడ వద్ద సన్నగా ఉన్న వంతెన నిత్యం ట్రాఫిక్‌జామ్‌కు కారణం అవుతోంది. మామిడిపూడి దళితవాడ నుంచి జెన్‌కో థర్మల్ కేంద్రానికి వెళ్లే రెండు కిలో మీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో రహదారి పూర్తిగా దెబ్బతిని కంకర పైకి లేచిపోయింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు, ద్విచక్ర వాహన చోదకులు నరకం అనుభవిస్తున్నారు. ఈమార్గంలో ప్రధానంగా థర్మల్ కేంద్రాల వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నందున సీఎస్ఆర్ నిధులతో రహదారులను మరమ్మతు చేయాలని పలుమార్లు థర్మల్ కేంద్రాల యాజమాన్యాన్ని కోరారు. అయితే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నందున ప్రభుత్వం చేపడుతుందని థర్మల్ అధికారులు చేతులు దులుపుకున్నారు. పరిశ్రమలకు వెళ్లే మార్గమైనందున వారే మరమ్మతు చేయించుకుంటారన్న కారణంతో అధికారులు నిర్లక్ష్యం వహించారు. అయితే నేలటూరు ముసునూరువారిపాలెం మామిడిపూడి పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి ఈమార్గంలోనే రావాల్సి ఉంది. నేలటూరు ముసునూరువారిపాలెం మామిడిపూడి పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి ఈమార్గంలోనే పయనించాల్సి ఉంది. ప్రతిరోజు మండల కేంద్రానికి రావాల్సిన ప్రజలు ఈ మార్గంలో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. అటు థర్మల్ కేంద్రాల యాజమాన్యం, ఇటు అధికారులు స్పందించి రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పొదలకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైతు సేవా కేంద్రం-3లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. జీలుగ 10 కేజీలు రూ.1230, జనుము రూ.1090, పిల్లిపెసర రూ.1440లుగా 50 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, నాయకులు కోవూరు వెంకటేశ్వర్లునాయుడు, పెంచలయ్య, నెట్టం పెంచలనాయుడు, దేవినేని శరత్, విశ్వచారి, రైతులు వంశీ, దయాకర్, మండల వ్యవసాయాధికారి వి ప్రతాప్, వ్యవసాయ విస్తరణాధికారి బి రాజామోహన్‌రెడ్డి, వీఏఏ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చట్టపరంగా మహిళలకు సైతం సమాన హక్కులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కే వాణి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి వివిధ రకాల హక్కులు లభించాయని, ఇదే క్రమంలో మహిళలకు సమాన హక్కులు ఉన్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి మహిళలు అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయస్థానం అందరికీ సమాన హక్కులు కల్పిస్తుందన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా, ఇతర సమస్యలు ఉన్నా న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమను తాము కాపాడుకునే హక్కులు ఉన్నాయని వాటిని వివరించారు. మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించి దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలను చైతన్య పరిచి అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రామిసరీ నోటు గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మాణిక్యం, సర్పంచ్ ఏడుకొండలు, టీడీపీ మహిళా నేత శ్రీనితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● సీఐ రామకృష్ణారెడ్డి

పొదలకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ హనీఫ్‌లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గురువారం జరిగే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనపై ఆంక్షలు ఉండడంతో జన సమీకరణకు అనుమతి లేదన్నారు. వైసీపీ నాయకులు ఎవరైనా జన సమీకరణ చేసినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలతో ర్యాలీగా వెళ్లడం, ఆటోలలో జనాలను తరలించడం, గుంపులుగుంపులుగా పోవడం లాంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నూకసాని

బిట్రగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికయ్యారు. నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు గడ్డం విజయకుమార్‌రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, కంచపాక కమలతో కలసి జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూకసాని ఎన్నిక కావడంతో నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

● వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం రాపూరు మండలం పంగిలి గ్రామ పంచాయతీలో నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో ఒక్క వైసీపీ ఎమ్మెల్యే గ్రామాలలోకి వచ్చి మాట్లాడిన దాఖలాలులేవని విమర్శించారు. పంగిలి పంచాయతీలో రూ.12.92కోట్ల అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు జెన్ని రమణయ్య, మండల అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ యువ నాయకులు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు కొండ్లపూడి రాఘవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి యోజనను సద్వినియోగం చేసుకోండి

● ఎస్బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీనరసింహులు

పొదలకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు ఎస్బీఐ చీఫ్ మేనేజర్ డి లక్ష్మీనరసింహులు సూచించారు. బ్యాంక్ ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఎంజేజేవై పథకంలో ఏడాదికి రూ.436 చెల్లించినట్లయితే వారికి రూ.2లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే సాధారణ మరణం పొందిన వారికి కూడా ఈ పథకంలో రూ.2లక్షలు బీమా సౌకర్యం ఉన్నట్లు వివరించారు. కాగా ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో భాగంగా ఏడాదికి రూ.20 చెల్లించినట్లయితే వారికి రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఆయా బీమా పథకాల్లో దరఖాస్తు చేసుకున్న వారి బ్యాంక్ ఖాతాల నుంచి ఏడాదికి రూ.20లు, రూ.436లు చొప్పున కట్ చేసుకోవడం జరుగుతుందన్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబాలకు బీమా పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎస్బీఐ ఖాతాదారులందరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ నేతకు దినేష్‌రెడ్డి పరామర్శ


టీడీపీ నాయకుడు బాలరవితో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

కోవూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న టీడీపీ నాయకుడు బాలరవిని ఏపీ ఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. స్థానిక సత్రం వీధిలో నివాసముంటున్న బాలరవి ఇంటికి టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు టీడీపీ నాయకత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కాటంరెడ్డి అమరేంద్రరెడ్డి, నాటకరాణి వెంకట్, తదితరులు ఉన్నారు.

నిధులున్నా నిర్మాణం ఊసేది..?

- ఆచరణకు నోచని అగ్నిమాపక కేంద్రం భవనం పనులు
- 4 నెలల క్రితమే రూ.1.38 కోట్లు మంజూరు
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- ఇంకా జాప్యం జరిగితే నిధులు వెనక్కెళ్లే పరిస్థితి


బుచ్చిలో డంపింగ్ యార్డుగా మారిన అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మించాల్సిన స్థలం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): బుచ్చిలో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ భవన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుంచి చేసిన ప్రయత్నాలు మళ్లీ కూటమి ప్రభుత్వంతో కదలిక వచ్చింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ప్రజల కల సాకారం చేస్తూ బుచ్చిలో అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణం కోసం రూ.1.38 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అంతకు ముందు బుచ్చిలోని మలిదేవి కాలువ పరిసర ప్రాంతంలో సర్వే చేసి అగ్నిమాపక కేంద్రం భవనానికి 30 సెంట్లు స్థలం కేటాయించారు. ఆ తరువాత భవనం నిర్మాణం కోసం విపత్తులు, అగ్నిమాపక శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరై 4నెలలైనా కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భవనం నిర్మించేందుకు కేటాయించిన స్థలంలో సుమారు 100 టన్నుల చెత్తతో డంపింగ్ యార్డు ఉంది. ఈ చెత్తను బుచ్చి మున్సిపాలిటీ అధికారులు తొలగించి స్థలాన్ని పోలీస్ హౌసింగ్ బోర్డు కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంది. అయితే కమిషనర్ గానీ, చెత్త రీసైక్లింగ్ కాంట్రాక్టరుకు ఆ ఊసే లేకపోవడం వల్ల అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణానికి ఇంజనీర్లు చేసిన మార్కింగ్‌కే పరిమితమైందన్న విమర్శలున్నాయి. అగ్నిమాపకశాఖకు తాత్కాలిక ఫైర్‌స్టేషన్ కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా బుచ్చిలోని శాంతినగర్ సచివాలయంలో ఓ భవనం కేటాయించారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ఒక టెండర్ మేరకు కొంత చెత్త తొలగించారనీ, మళ్లీ టెండర్ వేస్తే మిగతా చెత్తను కూడా తొలగిస్తారని సిగ్మా కంపెనీకి చెందిన టెండరు దారులు చెప్పారని కమిషనర్ తెలిపారు.

● 6 మండలాలకు...

బుచ్చిలో అగ్నిమాపక భవనం నిర్మిస్తే బుచ్చితోపాటు చుట్టుపక్కల సంగం, దగదర్తి, కొడవలూరు, కోవూరు, నెల్లూరు రూరల్ మండలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ 6 మండలాల్లో ఎక్కువ రైతాంగం, గడ్డివాములు, పూరి గుడిసెలు, సవక, జామాయిల్ తోటలు, ఎక్కువా ఉన్నాయి.

● నిర్మాణం జాప్యమైతే నిధులు వెనక్కే...?

బుచ్చిలో అగ్నిమాపక భవనం నిర్మాణం ఇంకా నెలలుపాటు జాప్యం అయితే మంజూరైన నిధులు కూడా వెనక్కెళ్లే పరిస్థితి ఎదురౌతుందని చెప్తున్నా నేటికీ స్థానిక అధికారుల్లో చలనం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి త్వరగా చెత్త తొలగింపు చర్యలు చేపట్టి భవన నిర్మాణం పనులు ప్రారంభించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంది.

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడంలేదన్న చందంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అగ్నిమాపక భవనం బుచ్చిలో ఏర్పాటుకు ఎంతో కృషి చేసి నిధులు మంజూరు చేయించారు. భవన నిర్మాణం చేపట్టే ప్రాంతంలో చెత్తను నగర పంచాయతీ కమిషనర్ తొలగించి కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

- కాసా శ్రీనివాసులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

చెత్త తొలగిస్తే నిర్మాణం ప్రారంభం

బుచ్చిలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగిస్తే అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. బుచ్చి మున్సిపాలిటీ కమిషనర్ తొలగిస్తామని చెబుతున్నారు.

- జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డి

C.R.I.M.E N.E.W.S

కావలి సినీ థియేటర్‌లో అగ్నిప్రమాదం

- క్షణాల్లో ఎగిసిపడిన మంటలు
- సామగ్రి, మిషనరీ దగ్ధం
- భయంతో పరుగులు తీసిన స్థానికులు


కాలి బూడిదైన థియేటర్ లోపలి భాగం

కావలి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని తుమ్మల పెంట రోడ్డులో ఉన్న స్రవంతి సినిమా థియేటర్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది కథనం మేరకు.. థియేటర్‌లోని ప్రొజెక్టర్ రూంలో ఉదయం 10.45 సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ తో క్షణాల్లో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగ చుట్టుపక్క లకు వ్యాపించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు, సినిమా థియేటర్ లో పనిచేసే సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమా దంలో ఫర్నీచర్, యంత్రాలు, థియేటర్ లోపలి భాగం మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనతో సుమారు రూ.కోటి మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు థియేటర్ యజమాని శంకర్‌రెడ్డి వాపోయాడు. థియేటర్‌లో మంటలు వ్యాపించడాన్ని గుర్తించిన సిబ్బంది అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక అధికారి శ్రీనాథ్‌రెడ్డి హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా రెండు గంటల పాటు శ్రమించి అదుపుచేశారు. అయితే థియేటర్‌లో ఉదయం 11.40 గంటలకు సినిమా ప్రదర్శన ఉండగా గంట ముందే ఈ ప్రమాదం జరిగింది. అదే సినిమా ప్రారంభం అయిన తరువాత ఈ ప్రమాదం జరిగి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేది. కాగా ఈనెల 31వ తేదీన విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్ డమ్ సినిమా ఈ థియేటర్‌లోనే ప్రదర్శన చేయాల్సి ఉండగా ఇంతలోనే ఈ ఘటన జరిగింది. సంఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దురదృష్టకరం : ఎమ్మెల్యే

సినిమా థియేటర్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద తీవ్రత తెలుసుకున్నారు. ఈ ప్రమాదం దురదృష్టకరమని, మంటలు చుట్టుపక్క ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా మంటలను పూర్తిగా ఆర్పివేసేందుకు సత్వరం నీళ్ల ట్యాంకర్లు తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించగా 5 ట్యాంకర్లతో నీటిని తెచ్చి అగ్నిమాపక సిబ్బందికి సహకరించారు. సత్వరం స్పందించిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

జామాయిలు తోట దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం


జామాయిలు తోటలో వ్యాపిస్తున్న మంటలు

కొండాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీలో జామాయిలు తోట దగ్ధమైంది. బాధితుడు యారవ కృష్ణయ్య కథనం మేరకు.. పంచాయతీలోని చల్లవారిపల్లె గ్రామ పరిధిలో దాదాపు 15 ఎకరాల జామాయిలు తోట ఉండగా బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారో ఏమోగానీ మంటలు వ్యాపించడాన్ని అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమ నించి ఆయనకు తెలియచేశారు. దీంతో అందుబాటులో ఉన్న ట్రాక్టరు ట్యాంకర్లతో నీటిని తరలించి రైతులు మంటలను ఆర్పా రు. ఈఘటనలో 11 ఎకరాల వరకు జామాయిలు తగులబడిం దని, దీంతో 10 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలిని కత్తితో బెదిరించి నగలు చోరీ


బాధితురాలిని విచారిస్తున్న ఎస్ఐ శివరాకేష్

మనుబోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామపురంలో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డాడు. కొద్ది సంవత్సరాలుగా మాధవగిరి పద్మావతమ్మ కోదండరాపురంలోని సాయిబాబా మందిరం సమీపంలో నివసిస్తోంది. రోజులాగే పద్మా వతమ్మ తలుపులు వేసుకుని ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు నెట్టుకుని వచ్చి, ఓ వ్యక్తి పద్మావతమ్మపై దాడి చేసి, కత్తితో బెది రించి ఒంటిపై ఉన్న బంగారు నగలు ఇవ్వాలన్నాడు. దీంతో భయ పడిన పద్మావతమ్మ చేతికున్న రెండు గాజులు, ఒక ఉంగరం, మెడలోని బంగారు గొలుసు తీయడంతో వాటిని తీసుకుని, పద్మా వతమ్మ బయటకు రాకుండా తలుపు గడియ పెట్టి ఉడాయించాడు. దీంతో ఆమె ఫోన్‌ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వ డంతో వారు వచ్చి చుట్టుపక్కల గాలించారు. విషయం పోలీసు లకు తెలపడంతో ఎస్ఐ శివరాకేష్ బాధితురాలి ఇంటికి చేరుకుని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. దుండగుడు ఎత్తుకెళ్ళిన బంగారు నగలు సుమారు 8సవర్లు ఉంటాయని బాధితురాలు పోలీసులకు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటాచలం గ్రామానికి చెందిన వేదగిరి ప్రకాష్ (61) తన మోటార్‌బైక్‌పై గత రెండు రోజుల కిందట ఇంటి దగ్గర నుంచి క్యాబా ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా అతివేగంగా మోటార్ బైక్ నడుపుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగా బైక్‌పై వస్తున్న ప్రకాష్‌ను ఢీకొన్నాడు. దీంతో ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో సహా అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ప్రకాష్ భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ అసుపత్రి ఆతర్వాత తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ జీజీ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు మృతుడి భార్య వేదగిరి ప్రసన్నలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248
కోడిగుడ్ల ధర (100)	475



పీ 4లో డిప్యూటీ మేయర్

● పేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న తహసీన్

నెల్లూరు(సిటీ), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4లో భాగంగా నెల్లూరు డిప్యూటీ మేయర్ తహసీన్ ఓ పేద కుటుంబాన్ని బుధవారం దత్తత తీసుకున్నారు. 48వ డివిజన్‌లో నివాసముంటున్న ఆ కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి జీవన ఉపాధి కోసం ఆర్థిక చేయూతనిందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, అమృత్ పథకం డీడీ మాధూరి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇంధన రంగంలో స్వావలంబనకు బయో ఎనర్జీ

● కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్

నెల్లూరు(హరనాథపురం), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఇంధన రంగంలో స్వావలంబన తెచ్చేందుకు జాతీయ బయోఎనర్జీ కార్యక్రమాన్ని నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ బయో ఎనర్జీ కార్యక్రమం కింద అందించిన సహాయాన్ని తెలియచేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో కోరగా మంత్రి పైవిధంగా సమా ధానం ఇచ్చారు. శుభ్రమైన వంట ఇంధనం కోసం చిన్న, మధ్యతరహా బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. వ్యర్థాల నుంచి ఎనర్జీ తయారీ ప్రాజెక్టులకు మద్దతు ఇస్తామని తెలిపారు.

ఎంఈవో-1 పోస్టులు సీనియారిటీతో భర్తీ చేయాలి

● ఫ్యాప్టో కోచైర్మన్ ప్రసాద్

నెల్లూరు(విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ, పంచాయతీ రాజ్ యాజమాన్యాల ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఫ్యాప్టో కోచైర్మన్ మాస ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జోన్-2 పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఎంఈవో-1 పోస్టులను భర్తీ చేస్తామంటూ వివరాలు సేకరించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి 72, 73, 74 జీవోలు అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వ అధికారులు పక్షపాత వైఖరితో వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకుని ఉమ్మడి సీనియారిటీ ద్వారానే భర్తీ చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డిప్యూటీ సెక్రటరీ జనరల్ వీవీ శేషులు, కార్యవర్గ సభ్యులు హజరత్, కృష్ణారెడ్డి, నరసింహ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనుపర్తిపాడులో అభివృద్ధి పనులు

నెల్లూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 24వ డివిజన్ కనుపర్తిపాడు గిరిజన సంఘంలో రూ.30 లక్షలతో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి పనులకు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అనంతరం మండలంలోని ఆమంచర్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. భూ రికార్డుల సమస్యలు ఉన్నవారు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు

● వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి

నెల్లూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందచేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. ఏవో ఎస్వీ నాగమోహన్‌తో కలిసి మండలంలోని ఆమంచర్ల, సౌత్‌మోపూరు గ్రామాల్లో బుధవారం రాయితీ విత్తనాలను రైతులకు అందచేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరికి తెగుళ్ల ఆశించి పంటను పాడుచేసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నల్లి తెగులు ఎక్కువగా ఆశిస్తుందని దాని నివారణకు అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

● మంత్రి ఆనం



మర్రిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా పర్యటన అనంతరం తిరిగి నెల్లూరు వెళ్తు న్న మంత్రి బుధవారం మర్రి పాడు మండల కేంద్రంలోని టీడీపీ మండల మాజీ అధ్య క్షుడు శాఖమూరి నారాయణ ఇంట్లో కాసేపు సేదదీరారు. అక్కడికి కొందరు రైతులు వచ్చి పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మంత్రిని కోరగా తప్పకుండా ప్రయత్నం చేస్తామని, ఇకమీదట రైతు పండించే ప్రతీ పంటను ముందుగా ఈక్రాప్ నమోదు తప్పక చేయించుకోవాలని, అను మతికి మించి సాగు చేసిన ఏ పంటను అమ్ముకునేందుకు వీలు ఉండదని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చెర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు ఉన్నారు.

మున్సిపాలిట చెత్త



కార్యాలయంలో స్థలం సరిపోక కారిడార్లో నిల్వ చేసిన ఫైళ్ల బస్తాలు



టేబుళ్లు, ఫైళ్లు, కుర్చీలు... ఎక్కడపడితే అక్కడే!

నగరంలో నిన్నటి వరకు పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే కనిపించాయి. ఇదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కూడా ఫైళ్లు పేరుకుపోయాయి. ఫైళ్లు భద్ర పరిచేదానికి సరైన వసతి లేకపోవడమో, లేక మరేమైనా కారణమోగానీ కార్యాలయంలోని ఏ అంతస్తులోకి వెళ్లినా వరండాల్లో ఫైళ్ల గుట్టలు కనిపిస్తున్నాయి. వందలాది దస్త్రాలను గోతాల్లో మూటలుగా కట్టి కారిడార్లో పడేస్తున్నారు. వీటిలో ఓటరు జాబితాలతోపాటు పలు ముఖ్యమైన ఫైళ్లు కూడా ఉన్నాయి. ఇలా ఓపెన్‌లో పడేస్తే వాటి భద్రత ప్రశ్నార్థకమే!. ఇవి కాక నిరుపయోగ ఫర్నిచర్‌ను కూడా ఇక్కడే నిల్వ చేస్తున్నారు. ఇవి అటు ఉద్యోగులకు, ఇటు సందర్శకులకు అసౌకర్యంగా మారాయి.

- ఫొటోలు : స్టాఫ్‌ఫొటోగ్రాఫర్





ఏ అంతస్తులో చూసినా ఇంతే..!



వామ్మో! కొండలాగ ఎన్ని బస్తాలో..

పన్ను చెల్లించలేదని కుళాయి కనెక్షన్ కట్



కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

నెల్లూరు(సిటీ), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు వివిధ రకాల పన్నులు చెల్లించలేదన్న కారణంతో అధికారులు ఐదు ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్ కట్ చేశారు. బుధవారం ఆర్ఐ కిరణ్ నేతృత్వంలోని బృందం 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీలో పర్యటించింది. ఇద్దరు భవన యజమానులు 21 ఏళ్లుగా పన్నులు చెల్లించకపోవడాన్ని గుర్తించారు. మొదటి చర్యల్లో భాగంగా కొళాయి కనెక్షన్ తొలగించినట్లు ఆర్ఐ తెలిపారు. 41వ డివిజన్ పరిధిలోని శివగిరి కాలనీలో కొన్నేళ్లుగా పన్ను చెల్లించని మూడిళ్లకు కూడా కొళాయి కనెక్షన్ తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

క్యాన్సర్ నివారణకు అపోలోలో 'ఎండ్ ఓ చెక్'

● 45 ఏళ్లు దాటిన మహిళలకు స్క్రీనింగ్ ● ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్, వైద్యులు

నెల్లూరు (వైద్యం), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిని నివారించాలన్న ఉద్దేశంతో నెల్లూరు అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎండ్ ఓ చెక్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. బుధవారం ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని వైద్య నిపుణులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 45 ఏళ్లు దాటిన మహిళలకు సోకే జననేంద్రియ క్యాన్సర్‌ను ఈ పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి వారికి సరైన వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జీవీవీ ప్రసాద్‌రెడ్డి, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ హరిత మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని రకాల క్యాన్సర్లకు ఆసుపత్రిలో అత్యుత్తమ చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'హరిహరవీరమల్లు' అందరూ చూడాల్సిన సినిమా

● జనసేన నాయకుల వెల్లడి



థియేటర్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 30 (ఆంధ్రజ్యోతి): హరిహర వీరమల్లు అందరూ చూడాల్సిన సినిమా అని జనసేన పార్టీ జిల్లా నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. వృద్ధ, అనాథాశ్రమాల్లోని వృద్ధులు, పిల్లలకు బుధవారం నగరంలోని ఎమ్-1 సినిమాస్‌లో హరిహర వీరమల్లు సినిమాను జనసేన నాయకులు ఉచితంగా ప్రదర్శించారు. చిత్రం విజయవంతం సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. ధర్మం కోసం పోరాడిన యోధుడి పాత్రలో పవన్ అద్భుతమైన నటన కరబరిచారని కొనియాడారు. ప్రజా వ్యతిరేక తతో ఎన్నికల్లో ఓడిపోయినా వైసీపీ వారి నోరు మాత్రం తగ్గడం లేదని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు జైలుకెళ్లింది స్వాతంత్ర్య పోరాటం చేసి కాదని, అవినీతి చేసి అని మర్చిపోయారని ఎద్దేవా చేశారు.

క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు విధిగా చేయాలి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

● పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పరిశీలన

నెల్లూరు (వైద్యం), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు విధిగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. బుధవారం నగరంలోని వేదాయపాళెం, పడారుపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించారు. క్షయ నివారణ పరీక్షలు, చికిత్స వివరాల రికార్డులను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్‌లో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. డామియన్ ఫౌండేషన్‌లో చికిత్స చేయించుకుంటున్న క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, కిరణ్, కౌన్సిలర్ వినయ్‌కుమార్, సూపర్వైజర్ వేణుగోపాల్, డామియన్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు సూచనలిస్తున్న ఏడీఎంహెచ్‌వో

ఖాజీ నియామకంపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతసాగరం, జూలై 30 (ఆంధ్ర జ్యోతి): మండల ఖాజీ నియామకంపై బుధవారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహ సీల్దారు జయవర్ధన్, మైనారిటీ అధికారులు ముస్లిం మత పెద్దలను విచారించారు. ప్రధానంగా రెండు వర్గాలకు చెందిన వారు తమ వారిని ఖాజీగా నియ మించాలని డిమాండ్ చేస్తున్న పరిస్థితి ఉండగా సమస్యల జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు వర్గాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంలో రెండు వర్గాల వారికి వాదోపవాదాలు జరిగాయి. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపి ఖాజీ పోస్టు నియమిస్తామని తహసీల్దారు పేర్కొన్నారు.

స్వమిత్వ సర్వేపై శిక్షణ

ఆత్మకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరి ఆధ్వర్యంలో స్వమిత్వ సర్వేపై డివిజన్ స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామ పంచాయతీలోని నివాస గృహాలను సర్వేచేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం, మర్రిపాడు, కలువాయి, సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, డిప్యూటీ ఎంఈడీవోలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లేక వెలవెల

● స్టూడెంట్స్ ఏడుగురు... తరగతి గదులు రెండు

● వైసీపీ ప్రభుత్వం చేపట్టిన తరగతుల విలీనమే కారణం

సంగం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన తరగతుల విలీనం కారణంగా విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల పోతున్నాయి. అందుకు నిదర్శనం అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీలోని పాఠశాలే. గతంలో ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండి సుమారు 32 మంది విద్యార్థులు చదువుకునే వారు. రెండు తరగతులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్టీ కాలనీలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను అన్నారెడ్డిపాళెం మెయిన్ పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు మిగిలాయి. రెండు తరగతుల్లో కేవలం ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలగా మారింది. దీంతో రెండు తరగతి గదుల్లో ఒకటి ఖాళీగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది.





పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వెలవెలబోతున్న అన్నారెడ్డిపాళెం గిరిజన పాఠశాల

పొదలకూరు సర్పంచికి షోకాజ్ నోటీసులు

పొదలకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్థులు, టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన డివిజనల్ పంచాయతీ అధికారి పలు అంశాలపై వివరణ కోరుతూ బుధవారం సర్పంచికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2020 నుంచి ఈఏడాది జూన్ వరకు రికార్డులపై విచారణ జరిపారు. సర్పంచి మల్లికా చిట్టెమ్మ సక్రమంగా రికార్డులను నిర్వహించడంతో విఫలమయ్యారని, నిధుల దుర్వినియోగంకు పాల్పడినట్లు, చర్యలు తీసుకోవాల్సిందిగా నివేదికలో పొందుపరిచారు. కాగా, సర్పంచిగా మల్లికా చిట్టెమ్మ తన విధులు నిర్వర్తించడంలో విఫలమైందని భావించి సమర్పించిన విచారణ నివేదిక మేరకు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారంలోగా తగు ఆధారాలతో లిఖితపూర్వకమైన సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అందులో పేర్కొన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

వెంకటాచలం సర్పంచికి కూడా...

వెంకటాచలం: గ్రామ పంచాయతీ సర్పంచి మందల రాజేశ్వరికి బుధవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి షోకాజు నోటీస్ జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. పంచాయతీలో నిధులు దుర్వియోగమయ్యాయని టీడీపీ నేత సండి రమేష్, ఇతర గ్రామస్థులు ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈవిషయమై ఇటీవల డీఎల్‌పీవో పంచాయతీని సందర్శించి నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. మందల రాజేశ్వరి సర్పంచిగా తన విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని, విచారణ నివేదిక మేరకు సంజాయిషీ కోరుతూ షోకాజు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన ఏడు రోజులలోగా తగిన ఆధారాలతో లిఖితపూర్వకమైన సంజాయిషీ ఇవ్వాలని, ఈమేరకు జారీ చేసిన షోకాజు నోటీసులో పేర్కొన్నారు. లేకుంటే తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- మండల కన్వీనర్ నియామకంపై అసహనం
- మేకపాటిని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీపీ భర్త


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఉదయగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వైసీపీలో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. ఇటీవల మండల వైసీపీ కన్వీనర్‌గా కొండా రాజగోపాల్‌రెడ్డిని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియమించారు. అతని నియామకం పట్ల ఓ వర్గం నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ దూరంగా ఉన్నారు. ఈ తరుణంలో బుధవారం ఎంపీపీ మూలె పద్మజ భర్త, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి తన స్వగ్రామమైన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు రాజకీయ భిక్ష పెట్టింది మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డన్నారు. తన సతీమణి ఎంపీపీ అయినా అటు ప్రభుత్వ, ఇటు సొంత నిధులతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ సస్పెండ్ చేసినా, పార్టీ మారినా మండలంలో నాయకులు ఎవరూ ఆయన వెంట వెళ్లకుండా కాపాడుకుంటూ వచ్చానన్నారు. అనంతరం అధిష్ఠానం మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తే ఆయన వెంట నడిచి ఆయన గెలుపునకు కృషి చేసినా దురదృష్టవశాత్తు ఓడిపోయామన్నారు. అయినప్పటికీ తాము ఆయన వెంట ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల మండల వైసీపీ కన్వీనర్ నియామకం విషయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఇతర నాయకులను సంప్రదించకుండా ఆయనకు ఇష్టమొచ్చిన వారిని నియమించుకున్నారన్నారు. ప్రజలతో సత్సంబంధాలు, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిని కన్వీనర్‌గా నియమించి ఉంటే బాగుండేదన్నారు. ఆయన ఎవరినైతే కన్వీనర్‌గా నియమించారో ఆ వ్యక్తి ఈరోజు కొంత మంది నాయకులకు ఫోన్ చేసి తాను నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వెళ్లరాదని బెదిరింపులు చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కన్వీనర్‌గా నియమించిన వ్యక్తి కుటుంబం 2019 వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేసిందో గుండెమీద చేయి వేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. మీ కుటుంబమే పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే తాను పోరాడనన్నారు. పార్టీని ఎవరు భ్రష్టు పట్టించారో ఆలోచించుకోవాలని హితవు పలికారు.


కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

పొగాకు ధరలో మార్పేది?

- రైతుల ఆందోళన

కలిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల ప్రారంభించి నాలుగు నెలలు దాటుతున్నా గరిష్ఠ ధరల్లో మార్పు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఈ ఏడాది పొగాకు కంపెనీలు ఆచితూచి పొగాకు కొనుగోళ్లు చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పొగాకు సాగుచేసిన రైతులకు మార్కెట్ అనుకూలించడంతో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300 మైలురాయి దాటడంతో రికార్డు ధరలు దక్కాయి. దీంతో ఈ ఏడాది కూడా అదే రీతిలో ధరలు దక్కుతాయన్న ఆశతో పొగాకుబోర్డు అనుమతించినదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి అధిక ఉత్పతి సాధించారు. ఈ ఏడాది ప్రారంభంలో మేలిమి పొగాకు ధర కిలో రూ.280 పలుకగా లోగ్రేడ్ పొగాకు ధర రూ.220 పలికింది. అయితే ప్రారంభంలో మేలిమి పొగాకుకు అందిన ధరలో నేటికీ మార్పు లేకుండా రూ.280గా ఉండటం, లోగ్రేడు పొగాకు ధర కిలో రూ.160 ప్రకారం కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మేలిమి పొగాకు గరిష్ఠ ధర పెరగకపోవడంతో రైతులు ఎక్కువ శాతం లోగ్రేడు పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. మార్కెట్‌లో లోగ్రేడు పొగాకు డిమాండ్ లేదనే కారణంతో కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో. పొగాకును తిరిగి ఇంటికి తీసుకెళ్లాలంటే శ్రమతో పాటు రవాణా ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024-25 పంట కాలానికి 5.2 మిలియన్ కేజీల పొగాకుకు బోర్డు అనుమతించగా ఇప్పటి వరకు 4.6 మిలియన్ పొగాకు అమ్మకాలు జరిగాయి. రైతులవద్ద ఇంకనూ 3మిలియన్ల కేజీలకు పైగా పొగాకు ఇళ్లవద్ద ఉంది. కొనుగోళ్ల చివరి దశలో మద్దతు ధరలు దక్కుతాయని మేలిమి పొగాకును ఇళ్లవద్దనే ఉంచి లోగ్రేడ్ పొగాకును ఎక్కువగా తీసుకువస్తున్నారని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. రైతులు మాత్రం ఈఏడాది కూలీల ఖర్చు, పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయని మేలిమిపొగాకు గరిష్ఠ ధరలను పెంచడంతోపాటు లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

పొణకా కనకమ్మకు 'భారతరత్న' ఇవ్వాలి

- ఆశయ సాధన సమితి సభ్యులు


విలేకరుల సమావేశంలో కనకమ్మ సేవల కరపత్రం చూపుతున్న సాధన సమితి సభ్యులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, గొప్పదాత పొణకా కనకమ్మకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని శ్రీమతి పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బీ సురేంద్రనాథ్‌రెడ్డి భారత ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నెల్లూరులోని టౌన్‌హాల్ రీడింగ్ రూములో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో కనకమ్మ సేవలు, దాతృత్వానికి సంబంధించి ప్రధాన మంత్రి మోదీకి 110 పేజీల నివేదిక పంపామని చెప్పారు. కనకమ్మ దానం చేసిన ఆస్తుల ప్రస్తుత విలువ రూ.2500 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో నెల్లూరు నగర నడిబొడ్డున కస్తూరిదేవి విద్యాలయం 21 ఎకరాల్లో ఉందని తెలిపారు. పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమానికి 22 ఎకరాలను ఆమె దానం చేశారని, నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్ద కస్తూరిదేవి ఇండస్ట్రియల్ స్కూల్‌ను స్థాపించారని చెప్పారు. తన కుటుంబ యావదాస్తి సూర్యచంద్రాదులు ఉన్నంతవరకు బాలికల ఉచిత విద్యకే ఉపయోగపడాలని 1926-27లో సొసైటీ కింద రిజిస్టర్ చేసి కస్తూరి దేవి విద్యాలయాన్ని స్థాపించారని వివరించారు. 1947లో భర్త పొణకా సుబ్బరామిరెడ్డి మరణానంతరం కనకమ్మ తమిళనాడులోని శ్రీరమణ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారని తెలిపారు. అక్కడ భగవద్గీతను తెలుగులోకి అనువదించారని, ఆ అనువాద పద్యాలను శ్రీరమణ మహర్షి స్వహస్తాలతో తిరిగి రాశారని పేర్కొన్నారు. అంతటి మహనీయురాలికి భారతరత్న ప్రకటించాలని కోరారు. కనకమ్మ సేవలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆ సమితికి చెందిన చలంచర్ల భాస్కర్‌రెడ్డి, షేక్ సందాని బాషా, దగ్గుమాటి కృష్ణయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం


శివకుమార్(ఫైల్)

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జీ శివకుమార్ (43) బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... నవాబుపేట పోలీసు క్వార్టర్స్‌లో శివకుమార్, స్వరూప దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. శివకుమార్ తల్లిదండ్రులు విడవలూరు మండలం ముదివర్తిలో ఉంటున్నారు. మంగళవారం శివకుమార్ తన తండ్రిని చూసివస్తానని భార్యతో చెప్పి ముదివర్తికి వెళ్లాడు. తిరిగి బుధవారం తెల్లవారుజామున బైక్‌పై నెల్లూరుకు బయలు దేరారు. నగరంలోని ప్రశాంతినగర్ జంక్షన్ దాటి కొద్దిదూరం వచ్చేసరికి బైక్ మరమత్తుకు గురైంది. దీంతో శివకుమార్ నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్, నవాబుపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శివకుమార్ భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. శివకుమార్ మృతికి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.


ఇంటింటా సర్వే చేస్తున్న క్షయ విభాగం అధికారులు, సిబ్బంది

ముక్త భారత్ అభియాన్ పేరుతో కార్యక్రమం

క్షయ నివారణకు

ఇంటింటా సర్వే

- డిసెంబరు వరకు నిర్వహణ
- జిల్లాలో 4,12,421 మందికి టీబీ పరీక్షలే లక్ష్యం
- ఇప్పటికి 22 శాతం ఇంటింటా సర్వే పూర్తి

నెల్లూరు (వైద్యం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్షయ వ్యాధి నివారణను పక్కాగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎక్కడెక్కడ వ్యాధిగ్రస్థులు ఉన్నారు... వారి పరిస్థితి ఎలా ఉంది..? అన్న కోణంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. క్షయను పూర్తిగా అరికట్టాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. దీని ద్వారా ఇంటింటికి తిరిగి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్నారు. దీర్ఘకాలికవ్యాధులు ఉన్నవారిలో క్షయవ్యాధిగ్రస్థులు ఉన్నారా ? అన్న కోణంలో ఈ సర్వే జరుగు తుంది. సర్వేలో భాగంగా మద్యం, పొగతాగేవారు, పొగాకు ఉత్పత్తులను విరివిగా ఉపయోగించే వారిని పరీక్షిస్తున్నారు. అలాగే మధుమేహం బాధితులు, 60 ఏళ్ల పైబడిన వారు, బాడీమాస్ ఇండెక్స్ 18.5 కంటే తక్కువ ఉన్నవారు, క్షయవ్యాధిగ్రస్థుల ఇంట్లో మూడేళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటెన్సిఫైడ్ టీబీ పేరిట జిల్లాలో 4,12,421 మందికి పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ విభాగం నిర్ణయించి, పరీక్షలు చేస్తున్నది.

22 శాతం మందికి పరీక్ష

ఇప్పటివరకు జిల్లాలో 22 శాతం అనగా 88,390 మందికి క్షయ పరీక్షలు నిర్వహించామని అధికారులు తెలిపారు. వీరిలో 224 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించామని వారు పేర్కొన్నారు. జూన్ 2న ఈ ముక్త భారత్ అభియాన్ ప్రారంభం కాగా, డిసెంబరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.కాగా ప్రభుత్వపరంగా 12,00 మందికి క్షయ వ్యాధి చికిత్సలు అందిస్తున్నట్లు అధికారులు చెబుతుండగా, వారి సంఖ్య ప్రైవేట్ ఆసుపత్రులతో కలుపుకుని 13వేలు ఉంటుందని తెలుస్తోంది. ఏటా క్షయ వ్యాధితో 100 మంది మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆధునిక వైద్యసేవలు

1992లో సవరించిన జాతీయ క్షయ నివారణ పథకం కింద జిల్లాలో 37 గళ్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ అనుమానితల గళ్ల పరీక్షలు చేసి వ్యాధి ఏ స్థాయిలో ఉందో గుర్తిస్తారు. క్షయ వ్యాధి తీవ్రత ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్) గుర్తించేందుకు డామియల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆధునాతన పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాధారణస్థాయి క్షయ వ్యాధికి ప్రత్యక్ష పర్యవేక్షణలో (డాట్స్) పద్ధతిలో చికిత్స అందిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి రూ. రెండు లక్షల విలువైన చికిత్సను ఉచితంగా అందచేస్తారు. జీజీహెచ్‌లో వ్యాధి స్థాయిని త్వరగా నిర్ధారించే అత్యాధునిక సీబీనాట్ పరికరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దాదాపు రూ.30 లక్షల తో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీనెలా జిల్లా వ్యాప్తంగా 500కుపైగా గళ్ల పరీక్షలను చేసి క్షయ వ్యాధి స్థాయిని నిర్ధారిస్తున్నారు..

పక్కాగా ఇంటింటా సర్వే



క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఇంటింటా సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నాం. ఇందులో క్షయ నివారణ అధికారులతోపాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొంటున్నారు. వీరు క్షయ వ్యాధికి సంబంధించిన అన్నీ పరీక్షలు చేస్తారు. తద్వారా వ్యాధిని గుర్తిస్తున్నారు. ప్రభుత్వ పరంగా క్షయవ్యాధిగ్రస్థులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో క్షయవ్యాధిని నియంత్రిస్తున్నాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం
- టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ సమీపంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రస్తుతం ఎంతోమంది యువత నైపుణ్యాలు ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరులో నిర్వహించు జాబ్‌మేళాకు ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గాదం వాసు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీలో సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు తూర్పుగోదావరి జిల్లాలో ఆగస్టు 14 నుంచి 17వతేదీ వరకు జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోండి

- లేఅవుట్లతోపాటు వ్యక్తిగత ప్లాట్లకూ అమలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), జూలై 30(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సంబంధిత యజమానులు సద్వినియోగం చేసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి పిలుపునిచ్చారు. నుడా కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా అనధికార లేఅవుట్లు వేశారన్నారు. వాటిలో ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ అనుమతి లేకపోవడంతో స్థలాలు కొన్న వారు తీవ్ర ఆందోళన చెందారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. దీంతో అనధికార లేఅవుట్లతోపాటు, వ్యక్తిగత ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. గతంలో క్రమబద్ధీకరణకు స్థలం విలువలో 14శాతం చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం 50శాతం రాయితీ కల్పించినట్లు చెప్పారు. అలాగే రైల్వే, రక్షణశాఖల నుంచి ఎన్‌వోసీ సమర్పించాల్సిన అవసరం లేకుండా చేశారన్నారు. స్థలాల క్రమబద్ధీకరణకు అక్టోబరు 24లోపు లైసెన్సుడ్ సర్వేయర్లు, ఇంజనీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కోటంరెడ్డి తెలిపారు. అలాగే 45రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లిస్తే 10శాతం రాయితీ, 90 రోజుల్లోపు చెల్లిస్తే 5శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నుడా పరిధిలో 450 మేర అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించామని, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో చర్చించి, ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ పథకంపై సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్‌సెంటర్‌ను నుడాలో ఏర్పాటు చేశామని, 86399 73397 ,8555871815 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో నుడా ప్లానింగ్ అధికారులు హిమబిందు, కాలేషా, ఏపీవోలు కుముదిని, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2వతేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-23 సీనియర్ మహిళల జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్ రాజశేఖర్ రెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్టు, వైట్ డ్రస్ కోడ్‌తో పాల్గొనాని, మరిన్ని వివరాలకు స్టేడియంలోని క్రికెట్ ప్రాంగణంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రాధాన్యత ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం),(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాధాన్యత ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని, ఎంబుక్ చేసిన ఒక నెల లోపు బిల్లులు తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. సాగునీటి కాలువల పనులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి పరిహారం వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సోమశిల, తెలుగ గంగ ప్రాజెక్టులు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు వెంకట రమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, దేశ్‌నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆత్మ పీడీగా మురళి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐ మురళి నెల్లూరులోని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించే దిశగా కృషి చేస్తానని, వ్యవసాయ అనుబంధ శాఖలను సమన్వయపరుచుకుంటూ క్షేత్ర స్థాయిలో పర్యటి స్తానని చెప్పారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న నిందితుడిని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను బుధవారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. వరుసగా ద్విచక్రవాహనాల చోరీలు జరుగుతుండటంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశామని చెప్పారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప ప్రాంతానికి చెందిన పీట్ల వంశీగా గుర్తించామన్నారు. బుధవారం గొలగ మూడి క్రాస్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు ద్విచక్రవాహనాలు అపహరించినట్లు అంగీకరించాడన్నారు. రూ.2.50 లక్షల విలువ కలిగిన ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చాటిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌ఐ నవీన్‌కుమార్, సాయికల్యాణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


నిందితుడి వివరాలు తెలుపుతున్న వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

సోమశిల జలాశయంలో 32 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 13,330 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా జలాశయంలో 32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారన్నారు.

వరకట్న వేధింపు కేసు కొట్టివేత

నెల్లూరు (లీగల్): కట్టుకున్న భార్యను వరకట్నం కోసం వేధించారన్న కేసులో నేరం రుజువు కాకపోవడంతో నలుగురిపై నమోదైన కేసు కొట్టివేస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ ఇన్‌చార్జి జడ్జి నిషాద్ నాజ్ షేక్ బుధ వారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరు రూరల్ మండలం నరుకూరుకు చెందిన షేక్ షమీలాకు తిరుపతి పట్టణానికి చెందిన షేక్ కరిముల్లాతో 2012 ఆగస్టు 26న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో షమీలా తల్లి దండ్రులు 15 సవర్ల బంగారు, రూ.5 లక్షల కట్నం ఇచ్చారని, వివాహానంతరం ఒక సంవత్సరం పాటు కువైట్ వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లిన కరిముల్లా మూడేళ్ల వరకు తిరిగి రాలేదని, వచ్చిన తరువాత తల్లి షేక్ మామాజిగిని, అతని అక్క షేక్ కలీమా, బావ షేక్ మహ బూబ్ బాషాతో కలిసి అదనపు కట్నం కోసం షమీలాను వేధించి ఇంటి నుంచి తరిమివేశారని అభియోగం. షమీలా నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే విచారణ కాలంలో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుల తరపున న్యాయవాదులు పీసీ కృష్ణయ్య, పీసీ కృష్ణ ప్రియాంకాదేవి వాదించారు.

సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

- సుమారు రూ.కోటి ఆస్తి నష్టం


తగలబడుతున్న ట్రాన్స్‌ఫార్మర్

కావలిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు.. 8 మెగా వాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ బుషింగ్ రాడ్ దగ్గర స్పార్క్ వచ్చి ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి మేర నష్టం వాటిల్లింది. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, కావలి ఈఈ జెనర్దీ ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరగటానికిగల కారణాలను తెలుసుకున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కారణంగా తుమ్మలపెంట, చినరాముడిపాలెం, కొత్తసత్రం, కొండాయగారి పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అర్ధరాత్రి నుంచి అంధకారంలో ఉన్నారు. బుధవారం ఉదయం అధికారులు అన్నగారిపాలెం, చెన్నాయపాలెం సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్‌ను ఆయా గ్రామాలకు పునరుద్ధరించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో చిత్తూరు నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తెప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దానిని గురువారం ఏర్పాటు చేయనున్నారు. కాగా సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

స్వమిత్వ సర్వేపై శిక్షణ

ఆత్మకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరి ఆధ్వర్యంలో స్వమిత్వ సర్వేపై డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామ పంచాయతీలోని నివాస గృహాలను సర్వేచేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం, మర్రిపాడు, కలువాయి, సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, డిప్యూటీ ఎంఈడీవోలు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9530
వెండి కిలో ధర	రూ. 117300
వెండి ఒక గ్రాము	రూ. 120.30

విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల

● ఏడుగురు స్టూడెంట్స్‌కి రెండు గదులు ● వైసీపీ ప్రభుత్వం చేపట్టిన తరగతుల విలీనమే కారణం

సంగం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన తరగతుల విలీనం కారణంగా విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల పోతున్నాయి. అందుకు నిదర్శనం అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీలోని పాఠశాలే. గతంలో ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండి సుమారు 32 మంది విద్యార్థులు చదువుకునే వారు. రెండు తరగతులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్టీ కాలనీలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను అన్నారెడ్డిపాళెం మెయిన్ పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు మిగిలాయి. రెండు తరగతుల్లో కేవలం ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలగా మారింది. దీంతో రెండు తరగతి గదుల్లో ఒకటి ఖాళీగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది.


వెలవెలబోతున్న అన్నారెడ్డిపాళెం గిరిజన పాఠశాల


పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు



అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

● సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ తెలిపారు.

? ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి.

! మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 30 లేఅవుట్లు ఉన్నాయి. అందులో 13 అక్రమ లేఅవుట్లుగా గుర్తించాం. ఇటీవల అక్రమ లేఅవుట్లలో సైడ్ కాలువలు, రోడ్లు తొలగించాం.

? అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎప్పటి వరకు అవకాశం ఉంది.

! ఈఏడాది అక్టోబరు 23వ తేదీ లోపల క్రమబద్ధీకరించుకోవాలి. 2025 జూన్ 30 లోపల రిజిస్ట్రేషన్ జరిగిన ప్లాట్లకు మాత్రమే ఈఅవకాశం ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోని అనధికార లేఅవుట్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

? ఎల్ఆర్ఎస్ ఫీజులకు సంబంధించిన వివరాలు ఏమిటి.

! ఎల్ఆర్ఎస్ ఫీజులకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

? పట్టణంలో తాగునీటి సరఫరా పరిస్థితి ఏమిటి.

! అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజు రక్షిత నీరందిస్తున్నాం. మంచినీటి సమస్య లేదు. మొత్తంగా 5 మిలియన్ల లీటర్ల నీరు నిత్యం సరఫరా చేస్తున్నాం.

? పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టాం.

సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యం : ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే సాధ్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండకిందపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతుల ఖాతాల్లో రూ.7 వేలు జమ చేయనున్నట్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సైతం త్వరలో కల్పిస్తారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉండేలా గురవారెడ్డి, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, మండవ మధు, సుబ్బరాయుడు, కాకర్ల మధు, చల్లా ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.


దుత్తలూరు(ఉదయగిరి): కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

●**ఉదయగిరి** : సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ సందానీలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వాల్మీకివీధి, రజక వీధుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేసి ఏడాది పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పిదాల వల్ల రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సూపర్‌సిక్స్ పథకాల్లో ఇప్పటికే 90 శాతం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అఖిల్, నవాజ్, నాతిక్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి : డిప్యూటీ డీఈవో


ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డిప్యూటీ డీఈవో నరసింహులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు అన్ని రకాల పరీక్షలతో పాటు మెయిన్ పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని కందుకూరు డిప్యూటీ డీఈవో నరసింహులు సూచించారు. బుధవారం జడదేవి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో తరగతుల వారీగా సమీక్షించారు. ప్రతిరోజు సాయంత్రం 4నుంచి 5గంటల వరకు పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనంతో పాటు రికార్డులు పరిశీలించి తగు సూచనలు అందజేశారు. అలాగే ఎంఈవో రమణయ్య ఇస్కపల్లి, కాంచెరువు ప్రాథమిక పాఠశాలలను తనిఖీచేశారు. విద్యామిత్ర కిట్లు సరఫరాపై విద్యార్థులను ఆరాతీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కావలి డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, సీఆర్పీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

ఉదయగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరుకు వస్తున్నందున వైసీపీ నాయకులు జన సమీకరణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అల శ్రీను హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో ఏపీ 34 యాక్ట్ అమల్లో ఉన్నందున సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో వైసీపీ నాయకులు ఎవరైనా ఫ్లెక్సీలు కట్టినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, వాహనాల్లో కార్యకర్తలను తరలించినా, ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అందులో భాగంగా పలువురు వైసీపీ నాయకులకు నోటీసులు సైతం జారీచేయడం జరిగిందన్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు లాడ్జీలు, అతిథి గృహాలను పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైనా పట్టుబడితే వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరుగుతుందన్నారు. కావున నిబంధనలను అనుసరించాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీను

మృతుడి కుటుంబానికి టీడీపీ నేతల పరామర్శ

వింజమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన షేక్ ఫారుక్ మంగళవారం విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీంతో టీడీపీ మండల కన్వీనర్ గూగా నరసారెడ్డి ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు ఫారూక్ కుటుంబాన్ని పరామర్శించారు. పార్థీవ దేహన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంచాల శ్రీనివాసులునాయుడు, ఎస్‌కె ఖాజావలి, పాములపాటి మాల్యాద్రి, ఉపాధ్యక్షులు ఆనందరమణయ్య, కోడూరు నాగిరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మహేష్, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన రక్షణ గోడ శిథిలం

● పొంచి ఉన్న ప్రమాదం


శిథిలమైన వంతెన రక్షణ గోడ

సంం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపాళెం వద్ద సదరన్ చానల్ కాలువ మీద ఉన్న వంతెన రక్షణ గోడ శిథిలమైంది. ఈ కాలువకు పడమటివైపున అరవపాళెం కాలనీ ఉంది. ఈ కాలనీలోని విద్యార్థులు రక్షణ గోడ శిథిలమైన వంతెన మీదనే నిత్యం పాఠశాలకు రావాలి. అరవపాళెం జండాదిబ్బ పంచాయతీ మజరా అరవపాళెం గ్రామస్థులు జండాదిబ్బకు రావాలంటే ఈవంతెన మీదనే రావాల్సి ఉంది. నిత్యం మోటారు బైక్‌లు, పశువులు రక్షణ గోడలేని వంతెనపైనే రావాలి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఇంటింటా లార్వా సర్వే


నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడులో బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా లార్వా సర్వే చేపట్టారు. సర్పంచు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నివాసాలతో పాటు పరిసరాల్లో నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి శుభ్రం చేయించారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కన్పించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు, ఆశ కార్యకర్త, పాల్గొన్నారు.

ఖాజీ నియామకంపై ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు

అనంతసాగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల ఖాజీ నియామకంపై బుధవారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దారు జయవర్ధన్, మైనారిటీ అధికారులు ముస్లిం మతపెద్దలను విచారించారు. ప్రధానంగా రెండు వర్గాలకు చెందిన వారు తమ వారిని ఖాజీగా నియమించాలని డిమాండ్ చేస్తున్న పరిస్థితి ఉండగా సమస్యల జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు వర్గాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంలో రెండు వర్గాల వారికి వాదోపవాదాలు జరిగాయి. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపి ఖాజీ పోస్టు నియమిస్తామని తహసీల్దారు పేర్కొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి : మంత్రి ఆనం

మర్రిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా పర్యటన అనంతరం తిరిగి నెల్లూరు వెళ్తున్న మంత్రి బుధవారం మర్రిపాడు మండల కేంద్రంలోని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ ఇంట్లో కాసేపు సేదదీరారు. అక్కడికి కొందరు రైతులు వచ్చి పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మంత్రిని కోరగా తప్పకుండా ప్రయత్నం చేస్తామని, ఇకమీదట రైతు పండించే ప్రతీ పంటను ముందుగా ఈక్రాప్ నమోదు తప్పక చేయించుకోవాలని, అనుమతికి మించి సాగు చేసిన ఏ పంటను అమ్ముకునేందుకు వీలు ఉండదని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చెర్మన్ ఆరికట్ల జనార్థన్ నాయుడు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి పనులు

ఆత్మకూరు, జూలై (ఆంధ్రజ్యోతి) 30: రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆత్మకూరు మున్సిపాల్టీలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళతున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ సి గంగాప్రసాద్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు సమస్యలపై ఏకరువు పెట్టారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్ మాట్లాడుతూ అజెండాలో చేర్చిన అంశాలపై కౌన్సిల్ సభ్యులతో చర్చించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 17వ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష మాట్లాడుతూ టిడ్కో గృహాల వద్ద నుంచి డంపింగ్‌యార్డు మీదుగా వీవర్స్‌కాలనీ వరకు రోడ్డు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హిందూ శ్మశానవాటికను శుభ్రం చేయించాలని, కొన్ని వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి వీధిలైట్లు వేయించాలని కోరారు. ఒక దశలో కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, తిరుపతమ్మ మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. అజెండాలో పొందుపరిచిన 60 అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

సీతారామపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్నిగ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల గురించి సమీక్షించి వచ్చే వారం చేపట్టబోయే పనులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పనులు కోరిన ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించాలని ఆదేశించారు. పని దినాలను పంచాయతీల వారీగా విభజించి ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కు టార్గెట్‌లను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో ఎన్ శ్యామల, సిఓ రవి, ఫీల్డ్ అసిస్టెంట్లు కొత్త జగదీష్, పిడతల ప్రభాకర్(బుజ్జి), ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్‌అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీవో సాయి ప్రసాద్

మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన

వింజమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం చింతలపాలెం గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారి ఏ వాసు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త ఎం సురేఖదేవి ఆధ్వర్యంలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మొక్కజొన్నలో తెగుళ్లు, కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న రైతులు, వ్యవసాయాధికారులు, పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

C.R.I.M.E N.E.W.S

కావలి సినీ థియేటర్‌లో అగ్నిప్రమాదం

● క్షణాల్లో ఎగిసిపడిన మంటలు ● సామగ్రి, మిషనరీ దగ్ధం
● భయంతో పరుగులు తీసిన స్థానికులు

కావలి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులో ఉన్న స్రవంతి సినిమా థియేటర్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది కథనం మేరకు.. థియేటర్‌లోని ప్రొజెక్టర్ రూంలో ఉదయం 10.45 సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో క్షణాల్లో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగ చుట్టుపక్కలకు వ్యాపించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు, సినిమా థియేటర్‌లో పనిచేసే సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఫర్నీచర్, యంత్రాలు, థియేటర్ లోపలి భాగం మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనతో సుమారు రూ.కోటి మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు థియేటర్ యజమాని శంకర్‌రెడ్డి వాపోయాడు. థియేటర్‌లో మంటలు వ్యాపించడాన్ని గుర్తించిన సిబ్బంది అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక అధికారి శ్రీనాథ్‌రెడ్డి హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా రెండు గంటల పాటు శ్రమించి అదుపుచేశారు. అయితే థియేటర్‌లో ఉదయం 11.40 గంటలకు సినిమా ప్రదర్శన ఉండగా గంట ముందే ఈ ప్రమాదం జరిగింది. అదే సినిమా ప్రారంభం అయిన తరువాత ఈ ప్రమాదం జరిగి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేది. కాగా ఈనెల 31వ తేదీన విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్ డమ్ సినిమా ఈ థియేటర్‌లోనే ప్రదర్శన చేయాల్సి ఉండగా ఇంతలోనే ఈ ఘటన జరిగింది. సంఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కాలి బూడిదైన థియేటర్ లోపలి భాగం

దురదృష్టకరం : ఎమ్మెల్యే

సినిమా థియేటర్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద తీవ్రత తెలుసుకున్నారు. ఈ ప్రమాదం దురదృష్టకరమని, మంటలు చుట్టుపక్క ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా మంటలను పూర్తిగా ఆర్పివేసేందుకు సత్వరం నీళ్ల ట్యాంకర్లు తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించగా 5 ట్యాంకర్లతో నీటిని తెచ్చి అగ్నిమాపక సిబ్బందికి సహకరించారు. సత్వరం స్పందించిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

జామాయిలు తోట దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

కొండాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీలో జామాయిలు తోట దగ్ధమైంది. బాధితుడు యారవ కృష్ణయ్య కథనం మేరకు.. పంచాయతీలోని చల్లవారిపల్లె గ్రామ పరిధిలో దాదాపు 15 ఎకరాల జామాయిలు తోట ఉండగా బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారో ఎమోగానీ మంటలు వ్యాపించడాన్ని అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమ నించి ఆయనకు తెలియచేశారు. దీంతో అందుబాటులో ఉన్న ట్రాక్టరు ట్యాంకర్లతో నీటిని తరలించి రైతులు మంటలను ఆర్పా రు. ఈఘటనలో 11 ఎకరాల వరకు జామాయిలు తగులబడిం దని, దీంతో 10 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


జామాయిలు తోటలో వ్యాపిస్తున్న మంటలు

వృద్ధురాలిని కత్తితో బెదిరించి నగలు చోరీ

మనుబోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామపురంలో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డాడు. కొద్ది సంవత్సరాలుగా మాధవగిరి పద్మావతమ్మ కోదండరాపురంలోని సాయిబాబా మందిరం సమీపంలో నివసిస్తోంది. రోజులాగే పద్మా వతమ్మ తలుపులు వేసుకుని ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు నెట్టుకుని వచ్చి, ఓ వ్యక్తి పద్మావతమ్మపై దాడి చేసి, కత్తితో బెది రించి ఒంటిపై ఉన్న బంగారు నగలు ఇవ్వాలన్నాడు. దీంతో భయ పడిన పద్మావతమ్మ చేతికున్న రెండు గాజులు, ఒక ఉంగరం, మెడలోని బంగారు గొలుసు తీయడంతో వాటిని తీసుకుని, పద్మా వతమ్మ బయటకు రాకుండా తలుపు గడియ పెట్టి ఉడాయించాడు. దీంతో ఆమె ఫోన్‌ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వ డంతో వారు వచ్చి చుట్టుపక్కల గాలించారు. విషయం పోలీసు లకు తెలపడంతో ఎస్ఐ శివరాకేష్ బాధితురాలి ఇంటికి చేరుకుని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. దుండగుడు ఎత్తుకెళ్ళిన బంగారు నగలు సుమారు 8సవర్లు ఉంటాయని బాధితురాలు పోలీసులకు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బాధితురాలిని విచారిస్తున్న ఎస్ఐ శివరాకేష్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటాచలం గ్రామానికి చెందిన వేదగిరి ప్రకాష్ (61) తన మోటార్‌బైక్‌పై గత రెండు రోజుల కిందట ఇంటి దగ్గర నుంచి క్యూబా ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా అతివేగంగా మోటార్ బైక్ నడుపుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగా బైక్‌పై వస్తున్న ప్రకాష్‌ను ఢీకొన్నాడు. దీంతో ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో సహా అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ప్రకాష్ భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ అసుపత్రి ఆతర్వాత తిరుపతిలోని ఎస్‌వీఆర్ఆర్ జీజీ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు మృతుడి భార్య వేదగిరి ప్రసన్నలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం రాష్ట్ర ప్రజలకు అందుతోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డు పోతురాజుమిట్ట, ఇస్లాంపేట ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడుపనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలిసంవత్సరంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, షేక్ ఖలీల్, షేక్ సలాంబాషా, అబ్దుల్‌రెహమాన్, రఫీ, గౌస్‌బాషా పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

- వీధుల్లో పారుతున్న మురుగు
- కాలువల్లో కదలని వ్యర్థాలు
- దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీల్లో దుస్థితి
- పట్టించుకోని పాలకులు, అధికారులు


బోగోలు యాదవపాలెంలో రోడ్డుపై మురుగునీరు


వీఎన్ఆర్‌పేట జడ్పీహైస్కూల్ వద్ద అధ్వానంగా డ్రైనేజీ కాలువ

బిట్రగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు అధ్వానంగా ఉండడంతో మురుగునీరు ముందుకు కదలక వీధుల్లోకి చేరుతోంది. వ్యర్థాలు ఎక్కడికక్కడ నిల్వచేరడం, అందులో పందులు సంచరిచడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల నివాసాలు ఉండే ప్రజలతోపాటు ఆ ప్రాంతంలో తిరిగే ప్రజలు దుర్వాసనను భరించలేక ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ప్రధానంగా బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీల్లో నెలకొంది. అయినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. బోగోలు మేజర్ పంచాయతీలో ప్రధాన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడి నాయకులు ఎవరూ వాటి గురించి పట్టించుకోవడం కానీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కానీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. యాదవపాలెం నాలుగు రోడ్ల కూడల్లో ప్రధాన కాలువ దెబ్బతినడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. రైల్వే ఎల్సీగేట్-143 చుట్టుపక్కల నుంచి వచ్చే కాలువల మురుగు యాదవపాలెం మీదుగా ఊరి బయటకు ప్రవహించాలి. అయితే ఆ కాలువ పూడిపోయి అస్తవ్యస్తంగా ఉంది. దీంతో సాధారణ రోజులతో పాటు వర్షాకాలం రోడ్డుపైన మురుగు నిల్వ ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ కాలువల గురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే నేతల మధ్య పార్టీలు, వర్గవిభేదాల కారణంగా పంచాతీల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ నేపథ్యంలో పాతహరిజనవాడ, మసీదువీధి, కుమ్మరవీధి, బృందావనం వీధిలోని కాలువలు పూర్తిగా దెబ్బతిని ఇళ్లలోని మురికి నీరు, వ్యర్థపదార్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి, వర్షాకాలంలో ఈ ప్రాంతంలో తిరగాలంటే ప్రజలు హడలిపోతున్నారు.

● మరో మేజర్ పంచాయతీ అయిన విశ్వనాథరావుపేటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పంచాయతీకి నిధులు తక్కువైనా జనాభా ఎక్కువగా ఉంటారు. ఇబ్రహీంపేట, విశ్వనాథరావుపేట, రామస్వామిపాలెంలో ఇటీవల కాలంలో సిమెంట్ రోడ్లు నిర్మించినా సైడ్ కాలువలు ఏర్పాటు చేయకపోవడం, పాత కాలువలు పూర్తిగా దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసనతో స్థానికులు అల్లాడుతున్నారు. విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలబాలికల పాఠశాల వద్ద ఉన్న కాలువ అధ్వానంగా మారి పందులకు నిలయంగా మారింది. అదే విధంగా పంతులువీధి, తూర్పు ప్రధాన కాలువ, మాజీ సర్పంచు వై.సుందరమూర్తి ఇంటి పక్కన ప్రధాన కాలువ, మసీదు ఎదురు ప్రధాన కాలువల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. కాలువలు దెబ్బతినడంతో పాటు కొన్ని కాలువలు ఆక్రమణలతో పూడిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. మేజర్ పంచాయతీలో ప్రధాన కాలువలే దుస్థితిలో ఉంటే మిగిలిన పంచాయతీల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలని, పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కలిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటనపై ఆంక్షలు ఉండటంతో, కలిగిరి సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, జలదంకి, వింజమూరు మండలాల్లో జనసమీకరణకు అనుమతులు లేవని సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. ఈ 4 మండలాల పరిధిలో వైసీపీ నాయకులు ఎవరైనా జనసమీకరణ జరిపినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఫ్లెక్సీలు ఏర్పాటు, ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

● కందుకూరు(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహనరెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి వైసీపీ నాయకులు జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు గుంపులుగా వెళ్లటం, రెచ్చగొట్టేవ్యాఖ్యలు చేయటం, వివాదాస్పదమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం నిషిద్ధమని తెలిపారు. జనసమీకరణ చేసి ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా తరలించాలని చూసినా, ర్యాలీగా నెల్లూరుకు బయలుదేరినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

● అల్లూరు(ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి కార్యకలాపాలకు ఉపక్రమించేందుకు అనుమతులు లేవని ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్ ప్లస్ భద్రతా ఉన్నందున మండలం నుంచి వైసీపీకి చెందిన నాయకులు ఎటువంటి ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు తదితర కార్యక్రమాలకు పాల్పడకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున రోడ్ షోలు, ప్లకార్డులు, రెచ్చగొట్టే నినాదాలు, బ్యానర్లు నిషేధించబడ్డాయని, జనసమీకరణ కార్యక్రమాలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


● కొండాపురం(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు పర్యటనకు మండలంలో జన సమీకరణ చేయవద్దని ఎస్ఐ మాలాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జనాలను సమీకరించి వాహనాలలో తరలించడం, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ర్యాలీలు చేయడం నిషేధమన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉందని నిబంధనలు ఉల్లంఘించిన నేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్


లింగసముద్రంలో వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నీటి సరఫరా జరిగే వాటర్ ట్యాంకుల నుంచి కలుషితమైన నీరు సరఫరా అవుతుండడంతో అధికారులు పలు గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశాల మేరకు లింగసముద్రం పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, జంగంరెడ్డిపాలెం గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు, గంగపాలెంలోని మంచినీటి ట్యాంకును పంచాయతీ కార్యదర్శి ఎం.మాధవరావు సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం ట్యాంకులకు నీరు నింపి సరఫరా చేశారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నూకసాని


బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు చెబుతున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికయ్యారు. నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు గడ్డం విజయకుమార్‌రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, కంచపాక కమలతో కలసి జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిలో నూకసాని ఎన్నిక కావడంతో ఆయన నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

న్యాయ సలహా తీసుకుని అభ్యంతరాలు తెలియచేస్తాం..


రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్

ఉలవపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరేడులో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు అభ్యంతరాలు తెలియచేయాలని, అలాగే భూముల పత్రాలు సమర్పించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ సిబ్బందితో వచ్చారు. 1210 మంది రైతులకు నోటీసులు అందించగా, 631 మంది మూకుమ్మడిగా అర్జీలు సమర్పించారు. అభ్యంతరాలపై ఆగస్టు 18వ వరకు గడువు ఇచ్చినందున, లాయర్లను నియమించుకొని వారి సలహా మేరకు అభ్యంతరాలు తెలియపరుస్తామని వారంతా ఆ వినతిపత్రాల్లో పేర్కొన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే అజయ్‌కుమార్, సీ పీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్, తదితరులు మాట్లాడుతూ రైతులను మభ్యపెట్టేందుకే ఎకరా భూమికి రూ.20 లక్షలు అంటూ ప్రకటన ఇచ్చారని అన్నారు. మొండిగా భూసేకరణకే మొగ్గు చూపితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు నిల్!

● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

వలేటివారిపాలెం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రజలకు పట్టణ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేసేలా ఏర్పాట్లు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, పీహెచ్‌సీల్లో జరిగే ప్రసవాలపై నమ్మకం లేక వేలకు వేలు వెచ్చించి పట్టణాల్లోని ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. దీంతో పీహెచ్‌సీలో ప్రసవాలు లక్ష్యం నెరవేరడం లేదు. వలేటివారిపాలెంలో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అందులో తగినంతమంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు. అంతేగాకుండా అవసరమైన వైద్య పరికరాలు ఉన్నాయి. అయితే పీహెచ్‌సీలో ఏడాదికి 60 కాన్పులు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఈ పీహెచ్‌సీలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వలేటివారిపాలెం పీహెచ్‌సీలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు 16 ప్రసవాలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 1, మేలో 1, జూన్‌లో 1 ప్రసవాలు జరిగినట్లు వైద్యులు తెలిపారు. అంటే సరాసరిన నెలకు 1 ప్రసవం జరిగినట్లు వైద్యులు తెలిపారు. మూడు నెలల్లో మూడు ప్రసవాల సంఖ్య దాటలేదంటే ఎలాంటి పరిస్థితి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

● ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

పీహెచ్‌సీలో ప్రసవాలు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డాక్టర్ శివసిద్ధప్ప తెలిపారు. అయినప్పటికీ గర్భిణులు పెద్దగా స్పందించడం లేదు. మండలంలో 21 పంచాయతీలు ఉండగా, 10 పంచాయతీల ప్రజలు కందుకూరు పట్టణానికి దగ్గరలో ఉండడం వలన స్థానిక పీహెచ్‌సీకి రాకుండా కందుకూరు వెళ్తున్నారు.

పసుపులేటి కుటుంబానికి పలువురి పరామర్శ


వెంకటరమణయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, తదితరులు

బిట్రగుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంకు చెందిన త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అధినేత, పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ సోదరుడు పసుపులేటి వెంకటరమణయ్య (చిన్నస్వామీజీ) ఈనెల 10వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఉత్తర క్రియలు బుధవారం స్వగ్రామంలో సుధాకర్, సుగుణమ్మ దంపతులు జరిపించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయరెడ్డి, సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, మాజీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్ర యువనేస్తం వ్యవస్థాపకుడు సతీష్ నాయుడు మిత్రబృందంతో కలిసి వచ్చి పసుపులేటి కుటుంబాన్ని పరామర్శించారు. కావలి నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు సుధాకర్ దంపతులను పరామర్శించారు.

పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ సర్వే

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


పారిశుధ్య నిర్వహణపై సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ సర్వే చేయిస్తుందని, పారిశుధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు వస్తాయని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ చాంబరులో బుధవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, పట్టణంలోని సచివాలయ కార్యదర్శులుతో మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ సర్వేలో రామమూర్తి పేట ఏరియా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తున్నారా, మీకు సమీపంలో చెత్తతో నిండిన చెత్తకుండీలు ఉన్నాయా, డ్రైనేజీలు తీస్తున్నారా తదితర ప్రశ్నలను ప్రజలను అడుగుతున్నారన్నారు. శానిటరీ కార్యదర్శులు తమ ప్రాంతాల్లోని ప్రజలను కూడా చైతన్యపరిచి మీరు చేస్తున్న సర్వీస్‌లకు మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. పారిశుధ్యం మెరుగుదలకు ఎప్పటి కప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇంటింటికి చెత్త సేకరణ ఆగకుండా నిత్యం దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. మీ పనితీరు ఐవీఆర్ సర్వేలో బయటపడుతోందని కనుక జర జాగ్రత్తగా పనిచేయలన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్!

● పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు ● అవస్థలు పడుతున్న ప్రజలు


నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

గుడ్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గుడ్లూరు ఎమ్మెస్సార్ కాలనీ దగ్గర ఏడాది క్రితం రూ.36 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్ నేటికీ వినియోగంలోకి రాక నిరుపయోగంగా ఉంది. దీంతో జగనన్న కాలనీతోపాటు, సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలని భావించిన ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్‌తోపాటుగా మెయిన్ పైప్‌లైన్, నీటి కులాయిలు కూడా ఏర్పాటు చేసినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం కారణంగా గత సంవత్సర కాలంగా వినియోగంలోకి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న సుమారు 50 కుటుంబాల వారు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే వాటర్‌ట్యాంక్ ఉన్నప్పటికీ అది వినియోగంలోకి రాకపోవడంతో చేతిపంపులు, నేలబావుల వద్దకు వెళ్లి తాగడానికి, వాడుకునేందుకు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అనేక సార్లు పంచాయతీ అధికారుకు, స్థానిక నాయకుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో చేసేదిలేక తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఆయా ప్రాంత ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సాగర్‌ను వివరణ కోరగా.. ట్యాంక్ పనులు పూర్తిచేసి పంచాయతీ అధికారులకు, గ్రామ సర్పంచుకి అప్పగించారని, వాళ్లకు నీరు వదిలే మనిషి లేకపోవడంతో ఈ ట్యాంక్ వినియోగంలోకి రాలేదన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


సామూహిక వరలక్ష్మీవ్రతం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, ఈవో తదితరులు

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్లశాంభవి ఆలయ ప్రాంగణలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మున్సిపల్, దేవదాయ శాఖ అధికారులు స్థానిక టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ఆలయానికి ఉత్తరం వైపున ఉన్న వరదకాలువ వలన ఆలయ ప్రాంగణం కుదించుకు పోవటమే కాక వాస్తుసమస్య కూడా ఉండటంతో ఆ కాలువపై రూ.60 లక్షలతో కాంక్రీట్ శ్లాబ్ పనులు చేపడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆ పనులను పరిశీలించి కాలువపై శ్లాబ్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఆగమన శాస్త్రప్రకారం అక్కడ ప్రహరీ నిర్మించేందుకు హద్దులను గిర్తించి మార్కింగ్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆగస్టు 8వ తేదీన ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలను నిర్వహిస్తుండటంతో వాటికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, ఆలయ ఈవో రాధాకృష్ణ, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోట్లూరి శ్రీనివాసులు, రాజకుమార్‌చౌదరి, అమరా వేదగిరి, తిరువీదిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానంపై భయమెందుకు..?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి


పోలీసు నోటీసు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


కావలి(టౌన్), జూలై 30(ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌కు ఉన్న ప్రజాభిమానంపై ప్రభుత్వానికెందుకంత భయమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంలో అరాచక పాలన సాగుతుందన్నారు. ప్రశ్నించే గొంతులను నులిపేస్తున్నారని, తప్పుడు కేసులు, అక్రమ అరెస్ట్‌లతో ప్రతిపక్షాన్ని అణిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. జగనన్న జిల్లా పర్యటనపై ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుంటారని, నెల్లూరు వెళ్లవద్దని వైసీపీ నేతలకు పోలీసు నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. వైసీపీ కార్యకర్తలు జగన్ అభిమానులు సంఘ విద్రోహ శక్తులా అని ప్రశ్నించారు. కావలిలో అవినీతి అక్రమాలకు కర్త కర్మ క్రియ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అని, అతను పైకి చెప్పేది నీతులని, మైనింగ్, ఇసుక, గ్రావెల్, రియల్ ఎస్టేట్ అవినీతి దందాలు వెనకుండి నడిపిస్తున్నారని ఆరోపించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి చేసింది వైసీపీ ప్రభుత్వమని, త్వరలో చంద్రబాబు ప్రారంభిస్తారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు




రక్తగ్రూపు పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థినులు

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులకు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ రక్తగ్రూపును కచ్చితంగా తెలుసుకుని ఉండాలన్నారు. ఎన్‌సీసీ అధికారి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ విద్యార్థులకు రక్తగ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులు కావలి రెడ్‌క్రాస్ సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీ. సరళకుమారి, సృజన, వాసవి, బీ.జనార్దన్‌రెడ్డి, విజయభారతి, రెడ్‌క్రాస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, శేషమ్మ, అనిల్ పాల్గొన్నారు.



షార్‌లో సంబరం

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం
- షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మంది దాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్యాహ్నమే షార్‌కు తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజామునుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలమైంది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడనుంది.



వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి

చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగుల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా సంయుక్త విజయం.

\- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్



మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ నారాయణన్



ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు

రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.







రాకెట్ మొదటి, రెండవ, మూడవ దశలు

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్

రెండో విడత 'దీపం' బుకింగ్‌కు నేటితో ఆఖరు



తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తోంది. ఈ దీపం-2 పథకం కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు గురువారంతో గడువు ముగియనుంది. ప్రభుత్వం అందచేసిన షెడ్యూల్ ప్రకారం జూలై 31లోగా సిలిండర్ బుక్ చేసుకోవాలి. ఒకసారి గడువు దాటిన తర్వాత అదే విడత కింద సిలిండర్ బుకింగ్‌కు అవకాశం ఉండదని డీఎస్వో శేషాచలం రాజు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4.20 లక్షల కనెక్షన్లు వున్నాయి. ఇందులో రెండో విడత కింద ఏప్రిల్ నుంచి జూలై 30 వరకు 3,63,297 మందికి ఉచిత సిలిండర్లు డెలివరీ అయ్యాయి. అందులో 3,45,040 మంది బ్యాంకు ఖాతాలకు ఇప్పటి వరకు సబ్సిడీ నగదు రూ.29.31 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో 3,15,303 మంది లబ్ధిదారులకు వారి వారి బ్యాంకు ఖాతాల్లో రూ 26.76 కోట్లు జమ అయ్యాయి. మిగిలిన వారికి నగదు జమకావాల్సి ఉంది. కాగా, ఆగస్టు ఒకటో తేది నుంచి మూడో విడత రాయితీ, సిలిండర్ వర్తింపు ప్రారంభం కానుంది.

రాయితీ జమ కాకుంటే 1967కు కాల్ చేయండి

ప్రభుత్వం నుంచి సబ్సిడీ సిలిండర్‌కు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకుంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసి సమస్య తెలియచేయవచ్చును. ఈ విషయమై ముందుగా గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలి. మళ్ళీ ఈకేవైసీ చేయించుకుని మరొక సారి బ్యాంకు అధికారులను సంప్రదించాలి. రాయితీకి సంబంధించి అర్హత ఉంటే తప్పనిసరిగా ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది. దీపం-2 కింద ఒక్క రోజులో గడువు ముగుస్తున్నందున మరో 18,000 మంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవాలని డీఎస్వో శేషాచలం రాజు విజ్ఞప్తి చేశారు.

4,771 మందికి భాగస్వామి పింఛన్లు

- ఆగస్టు నుంచి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4,771 మందికి భాగస్వామి (స్పౌజ్) పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ఆగస్టు నుంచి పింఛను ఇవ్వనున్నారు. ఇంటిపెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం కొండత అండగా నిలిచింది. కొంత కాలంగా వీరిని ఊరిస్తున్న భాగస్వామి పింఛనును ఆగస్టు ఒకటిన పంపిణీ చేయనున్నారు. 2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 మధ్య సామాజిక భద్రత పింఛను తీసుకుంటూ మృతి చెందిన వారి పింఛనును.. వారి జీవిత భాగస్వామికి బదలాయించేందుకు ఏప్రిల్ 24 నుంచి చర్యలు ప్రారంభించారు. మరణించిన లబ్ధిదారుడి వివరాలు, ధ్రువపత్రంతో పాటు జీవిత భాగస్వామి వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. వీరితో పాటు 2024 నవంబరు నుంచి మృతి చెందిన వారి భాగస్వామికీ (స్పౌజ్) పింఛను అవకాశం కల్పించారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని పింఛను కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో జూన్‌లో పంపిణీ చేస్తామని చెప్పి ఆఖరి నిమిషయంలో వాయిదా వేశారు. జూలైలోనూ వాయిదా పడింది. తాజాగా ఆగస్టులో భాగస్వామి పింఛన్లు అందుతాయని ప్రభుత్వం చెప్పడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 4,771 మందిని భాగస్వామి పింఛన్లకు అర్హులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దరఖాస్తులు సైతం స్వీకరించలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ భరోసా పథకంలో స్పౌజ్ పింఛను విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సామాజిక పింఛను తీసుకునే భర్త మృతి చెందితే భార్యకు, ఆ మరుసటి నెల నుంచే పింఛను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రేపు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను శుక్రవారం 2,63,743 మందికి సచివాలయ సిబ్బంది పంపిణీ చేయనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి పింఛను అందజేయనున్నారు. పింఛన్లకుగాను రూ.113కోట్లు కేటాయించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు.

ఫెర్టిలిటీ సెంటర్‌లో తనిఖీలు



ఫెర్టిలిటీ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, విశాఖలోని 'సృష్టి' కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో తిరుపతిలోని ఫెర్టిలిటీ సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. లావణ్య ఫెర్టిలిటీ సెంటర్‌ను బుధవారం డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తనిఖీ చేసి సేవలను, రికార్డులను, వైద్య పరికరాలను పరిశీలించారు. ఫెర్టిలిటీ సెంటర్లు ఏఆర్‌టీ చట్ట ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.68కోట్లు

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.2,68,87,640 లభించింది. ఆలయంలోని కోట మండపం వద్ద బుధవారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల హుండీల ద్వారా బంగారం 97 గ్రాములు, వెండి 882.640 కేజీలు, విదేశీ కరెన్సీ 235 వచ్చాయి. 40 రోజులకు ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి డాలర్ల కేసులో..

15 మందిపై చర్యల నిలిపివేత

- ఆరోపణలు రుజువు కాకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వులు
- 19 ఏళ్ల తర్వాత ఆరోపణల నుంచి విముక్తి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి డాలర్ల విక్రయ కౌంటర్‌లో అక్రమాలు జరిగాయంటూ 19 ఏళ్ల కిందట సంచలనం సృష్టించిన కేసులోని ఆరోపణల నుంచి 15 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు విముక్తి పొందారు. మొత్తం 20 మందిపై ఆరోపణలు రాగా క్రిమినల్, శాఖాపరమైన విచారణల అనంతరం వీరిలో 15 మందిపై చర్యలు నిలిపివేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురు పదవీ విరమణ చేయగా, కొందరు మరణించారు కూడా. తిరుమల శ్రీవారి డాలర్ల విక్రయాల కౌంటర్‌లో 5 గ్రాముల బరువుండే 300 శ్రీవారి డాలర్లు అదృశ్యమయ్యాయని 2006లో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం గుర్తించింది. వాటి విలువను రూ.15.40 లక్షలుగా అంచనా వేసింది. ఈ మేరకు విచారణ జరిపి 20 మంది బాధ్యులంటూ టీటీడీకి నివేదిక అందించింది. అప్పట్లో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించగా, వాళ్లూ దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారు. విజిలెన్స్, సీబీసీఐడీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం సంబంధిత ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ.. ఆ బాధ్యతను కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించింది. తొలుత కేసును అప్పటి కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సుబ్రేంద్రు భట్టాచార్యకు, తర్వాత మరో సభ్యుడు, రిటైర్డు ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణకు అప్పగించారు. గతేడాది జనవరిలో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. విచారణలో 15 మంది ఉద్యోగులు, అధికారులపై ఆరోపణలు రుజువు కాలేదని నివేదికలో పేర్కొంది. వీరిపై చర్యలు నిలిపివేయాలని టీటీడీ ఈవో ప్రభుత్వాన్ని కోరగా.. ఆ మేరకు రెవెన్యూ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ 15 మంది వీరే

తిరుమల పేష్కార్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.రఘురామిరెడ్డి, ఇ.రామచంద్రారెడ్డి, ఏవీ రమణమూర్తి, డీఈవో ఆర్.రంగనాధాచారి, ఇన్‌స్పెక్షన్ విభాగం ఏఈవో కె.చిత్తరంజన్, సీనియర్ అసిస్టెంట్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్లు బి.మురళీకృష్ణమూర్తిరాజు, రావినూతల శ్రీరామ్, సూపరింటెండెంట్లు ఎం.వెంగన్న, కె.గోవర్ధన్, డిప్యూటీ ఈవో ఎస్.చెంచులక్ష్మి, సీనియర్ అసిస్టెంట్, బొక్కసం క్లర్క్ బీఆర్ గురురాజారావు, రిసెప్షన్ విభాగం డిప్యూటీ ఈవో ఆర్.ఉమాపతి, వైకుంఠం క్యూ కాంప్లెక్సు ఏఈవో, ఇన్‌స్పెక్షన్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.గజపతి. వీరిలో గురురాజారావు, రావినూతల శ్రీరామ్ సర్వీసులో ఉన్నారు. మురళీకృష్ణమూర్తి రాజు, ఎం.వెంగన్న, ఏవీ రమణమూర్తి రిటైరై మరణించారు.



సైకిల్‌పై శాంతి యాత్ర

● 60ఏళ్ల వృద్ధుడి సాహసం

వందల కిలోమీటర్లు తిరిగి పాతపడ్డ సైకిల్! దాని ముందూ, వెనుక లగేజీ బ్యాగులు! సైకిల్ చుట్టూ హిందీ, ఇంగ్లీషు భాషలో రాసిన బోర్డులు! ఓ 60 ఏళ్ల వృద్ధుడు గిరిగిరామంటూ తిరుపతిలో ఆ సైకిల్ తొక్కుతూ జోరుగా వెళుతున్నారు. అతడిని ఆపి పలకరిస్తే ఆసక్తికర విషయాలు చెప్పారు.

కర్నాటక రాష్ట్రం హసన్ జిల్లాకు చెందిన నాగరాజ్ గౌడ్ సైకిల్ యాత్ర ద్వారా దేశం చుడుతున్నారు. పదో తరగతి మాత్రమే చది విన ఆయన కన్నడ, హిందీ, తెలుగు, తమిళ్, హిందీ, ఇంగ్లీషు భాషలు అనర్గళంగా మాట్లా డుతున్నారు. కన్నడలో జూనియర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో నటించారు. పెళ్లి చేసుకో కుండా బ్యాచిలర్‌గా ఉండిపోయారు. భవబం ధాలకు దూరమై ఏకనిరంజన్‌గా మారినత ర్వాత విశ్వశాంతికోసం సైకిల్ యాత్ర చేయాల నుకున్నాడు. 'ప్రపంచ శాంతి, సహజ వనరుల పరిరక్షణ, మనుషులంతా ఒక్కటే, సమైక్యతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు భారతదేశ యాత్ర చేస్తున్నా. 2017 డిసెంబరులో ముంబై నుంచి యాత్ర మొదలుపెట్టా. కరోనా



సమయంలో రెండేళ్ల నిలిపివేశా. మళ్లీ మొదలు పెట్టా. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హరి యాణా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరా ఖండ్, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, వెస్ట్‌బెంగాల్, తెలంగాణ మీదుగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర కొనసాగు తోంది. రోజుకు 60 నుంచి 80 కి.మీ ప్రయాణం చేస్తా. ఆలయాలు, ఆశ్రమాల వద్ద రాత్రి బస చేస్తా. దారిన కనిపించే దాతలు ఇచ్చే ఆర్థికసా యంతో దారి ఖర్చులు పెట్టుకుంటా. యాత్రలో భాగంగా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిశా. మరో రెండేళ్లలో దేశవ్యాప్త యాత్ర ముగుస్తుందని అనుకుంటున్నా' అని అన్నారు నాగరాజ్ గౌడ్.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.89 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,183

తలనీలాలు సమర్పించినవారు: 25,906



అమ్మో.. గజరాజులు

● భయం గుప్పెట్లో సత్యసాయి ఎస్టీ కాలనీ వాసులు ● మామిడి చెట్ల ధ్వంసం

చంద్రగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురం పంచాయతీ సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతంలో మళ్లీ ఏనుగులు సంచరించాయి. రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తుండటంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి 11 ఏనుగుల గుంపు శ్రీనివాసమంగాపురం సమీపం లోని శ్రీవారిమెట్టు మార్గంలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ మంగళవారం రాత్రి 9 గంటల సమ యంలో ఏనుగుల గుంపు సత్యసాయి ఎస్టీ కాలనీ సమీ పంలోని మేడసాని ఆనందనాయుడు మామిడి తోటలోకి వచ్చాయి. ఐదు మామిడి చెట్లను విరిచేశాయి. పక్కనే ఉన్న చెంచయ్య వరిపైరునూ తొక్కి నాశనం చేశాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు తమ సిబ్బం దితో వెళ్లి డ్రోన్ సాయంతో ఏనుగుల గుంపును గుర్తించి కాలనీలలో రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా పేల్చారు. బుధవారం ఉదయం 6.30 గంటల సమ యంలో ఏనుగులు మళ్లీ శేషాచలం అడవుల్లోకి వెళ్లిపోవ డంతో అటవీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏను గుల గుంపు శేషాచలం అటవీ ప్రాంత సమీపంలో సంచ రిస్తుండటంతో ఇప్పటికే నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికా రులు మండలంలోని శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచి స్తున్నారు. ఈ ప్రాంతాల ప్రజలు, అటవీ సిబ్బంది సంయుక్తంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఏదైనా ఏనుగుల సంచారం, కదలికలు, ఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలని అధికారులు కోరారు.



సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో వచ్చిన ఏనుగులు

'జూనియర్' మొక్కు చెల్లించుకున్నా

● తిరుమలలో హీరో గాలి కిరీటిరెడ్డి



గాలి జనార్దన్ రెడ్డి, కిరీటి రెడ్డి

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'జూని యర్ సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు తిరుమలకు వచ్చి స్వా మిని దర్శించుని ఆశీర్వ దించమని మొక్కుకున్నా. ప్రేక్షకులు సినిమాను ఆదరించారు. మొక్కు చెల్లించుకోవడానికి మళ్లీ వచ్చా' అని హీరో గాలి కిరీటిరెడ్డి తెలిపారు. తన తండ్రి, పారిశ్రామికవేత్త గాలి జనా ర్దన్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడి యాతో మాట్లాడుతూ.. రెండువారాల్లో తన తర్వాతి సిని మాను ప్రకటిస్తామన్నారు. ప్రముఖ హీరోలు పునిత్ రాజ్‌కు మార్, జూనియర్ ఎన్టీఆర్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. తన కుమారుడు కిరీటి చిన్నప్పటి నుంచే కళాకారు డని గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు.





లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, అమరనాథరడ్డి, గురజాల జగన్మోహన్ తదితరులు



నానీని పలకరిస్తున్న చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

పులివర్తి లక్ష్మీభారతికి ప్రముఖుల నివాళి

పాకాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి, పులివర్తి లక్ష్మీభారతికి పలువురు ప్రముఖులు, అధికారులు నివాళులు అర్పించారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో బుధవారం జరిగిన లక్ష్మీభారతి కర్మక్రియలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, గురుజాల జగన్మోహన్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, భాష్యం ప్రవీణ్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీసీసీబీ అధ్యక్షుడు అమాస రాజశేఖర్ రెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, ఏఎస్పీ రవి మనోహరాచారి, టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, చంద్రప్రకాష్‌నాయుడు, వలపల దశరథనాయుడు, చంద్రగిరి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై లక్ష్మీభారతికి నివాళులు అర్పించారు.

మహిళల ఉచిత ప్రయాణం అమలుకు సిద్ధంగా ఉన్నాం

పూల నాగరాజు - దిల్‌రాజు, అశోక్ - అశ్విని

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారన్నారు. మహిళలు గౌరవంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా సీఎం అనేక సూచనలు చేశారన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలోని మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అలాగే, సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు అశోక్, సీఎం ప్రోగ్రాం అడ్వైజర్ పి.వెంకటేష్, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కన్నడ సినీనటుడు పునీత్‌రాజ్‌కుమార్ సతీమణి అశ్విని ఉన్నారు.

హేళనగా చూస్తున్నారు..!

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించిన విద్యార్థినులు



వసతి గృహంలో విద్యార్థినులను విచారిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పూడిమిట్ల కుమారి

కోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు హేళనగా చూస్తున్నారు.. సహచర విద్యార్థినులతో కలసిపోదామంటే అంగీకరించడం లేదు.. పాఠశాలకు వెళ్లా లంటే భయమేస్తుందని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించారు. కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ వసతిగృహం విద్యార్థినులను యూనిఫాం వేసుకొని రాలేదన్న కారణంగా బెత్తంతో కొట్టి గుంజిళ్లు తీయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారించిన డీఈవో కేవీఎన్ కుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు పూరిమిట్ల కుమారి, యుగంధర్ పొన్న కోటలోని వసతిగృహంలో విచారణ చేపట్టారు. అలాగే తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, అసెంబ్లీ కమిటీ సభ్యురాలు పోలమ్మ, పార్లమెంట్ కార్యదర్శి భారతి, మాజీ జడ్పీటీసీ ప్రమీల, టౌన్ ప్రెసిడెంట్ గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ కల్పన వసతిగృహంలో విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ యూనిఫాం వేసుకురాలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు తమను దుర్భాషలాడుతూ కొట్టిన సంగతి వాస్తవమే అన్నారు. ఈ ఘటన జరిగిన తరువాత పాఠశాలలో ఎవరూ తమతో మాట్లాడటం లేదని కంటతడి పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోయారు.కాగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సమక్షంలో శుక్రవారం మళ్లీ విచారణ చేపడుతామని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు తెలిపారు. పూర్తి వివరాలను సీడీ, నివేదిక రూపంలో విద్యాశాఖమంత్రి లోకేశ్‌కు పంపుతామని చెప్పారు.



మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ వీరభద్రస్వామి

పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన

సత్యవేడు, జూలై 30: (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్ (ఏపీ) వీరభద్రస్వామి ఆధ్వర్యంలో బుధవారం పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన సదస్సు జరిగింది. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ ప్రోగ్రాంగా పిలిచే పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో ఆమోదించింది. దీనిపై అవగాహన పెంచి పథకం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల సృష్టి, పరిశ్రమల యాజమాన్యాలు కొత్త ఉద్యోగులకు అందించే ఆర్థిక ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు రవితేజరెడ్డి(కడప), సతీష్‌కుమార్ (తిరుపతి), శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్)రమేష్ కుమార్, హెచ్‌ఆర్ ప్రతినిధి శివకుమార్, ఈపీఎఫ్‌వో ఉన్నతాధికారులు, వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వలసల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 6వతరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న జరిగే ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీత తెలిపారు. ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడవు పొడించినట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో విద్యార్థులు నివాసం ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 89199 56395, 70132 01138 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైలు దారిమళ్లింపు

● అరక్కోణం జంక్షన్ వద్ద ఇంటర్ లాకింగ్ పనులతో తిరుపతి మీదుగా రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైళ్లు (07153- 07154) ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబరు 27వ తేది వరకు తిరుపతిమీదుగా నడవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. 'ఈ ప్రత్యేక రైళ్ళు రేణిగుంట, తిరుత్తణి, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా రాక పోకలు సాగించేవి. అరక్కోణం రైల్వే జంక్షన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న కారణంగా దారి మళ్లించారు. తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా బెంగళూరుకు రాక పోకలు సాగిస్తాయి. నరసాపూర్‌లో బయలుదేరి తిరుపతికి తెల్లవారుజామున 3.38 గంటలకు చెరుకొని.. 3.43 గంటలకు తిరిగి బెంగళూరుకు బయలుదేరుతుంది. బెంగళూరు నుంచి వచ్చేటప్పుడు తిరుపతికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకొని 5.35 గంటలకు బయలుదేరుతుంది' అని ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాంకర్లూ.. భద్రతా చర్యలు తీసుకోండి

● 'హిందూపురం' ఘటనతో అప్రమత్తం చేస్తున్న పోలీసులు



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న అలిపిరి ఎస్‌ఐ అజిత

తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బుధవారం పోలీసు అధికారులు బృందాలుగా అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగులతో మాట్లాడి అప్రమత్తం చేశారు. ప్రతి బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి సామర్థ్యంతో సెక్యూరిటీ ఉండాలని సూచించారు. అనుమానితులు బ్యాంకుల వద్ద తిరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో డీఎస్పీ భకతవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్, మురళీమోహన్, రామయ్య, ఎస్‌ఐలు తమ పరిధిలోని బ్యాంకుల వద్దకు వెళ్లి భద్రతకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. రానున్న వారం రోజుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ నియామకాలు పూర్తిచేసి మీ బ్యాంకులకు మీరే భద్రత ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

పద్మావతి పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు



ఉత్తర్వులతో టీటీడీ ఈవో శ్యామలరావు, ప్రిన్సిపాల్ పద్మావతమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌కి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. గత నెలలో ఎన్‌బీఏ బృందం ఈ కాలేజీలో పర్యటించింది. విద్యార్థులు, ఉద్యోగులు, లైబ్రరీ, ల్యాబ్ తదితర సదుపాయాలు, ప్రమాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, అధ్యాపకులను టీటీడీ ఈవో శ్యామలరావు అభినందించారు. ఈ కాలేజీ మరింత ఉన్నత గుర్తింపును సంతరించుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

రెడ్ శ్యాండిల్ కోర్టు స్పెషల్ పీపీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఏర్పాటు చేసిన రెడ్ శ్యాండిల్ కోర్టు న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అమరనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ లీగల్ అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా ప్రభుత్వం ఈయన్ను రాష్ట్ర ఎర్రచందనం కోర్టుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తగు సాక్ష్యాధారాలతో ఎర్రచందనం స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

నలుగురు దొంగల ముఠా అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు
● రూ.20.4 లక్షల నగలు, రెండు బైకులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీసులు బుధవారం కరుడుగట్టిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు. ఈ వివరాలను తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లా సేరిక్కలై గ్రామానికి చెందిన ఎం.మణి అలియాస్ కోవిల్‌మణి, ఎం.సురేష్ స్నేహితులు. వీరు తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. అలాగే, తిరుపతి నగరం మంగళం పరిధిలోని తిరుమల నగర్‌కు చెందిన స్నేహితులు కుమార్, మణికంఠ చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అయితే వీరు గతంలో తమిళనాడులో దొంగతనాలు చేసి వేలూరు జైలులో ఉండగా, తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులతో పరిచయమైంది. ఆ తర్వాత ఈ నలుగురూ కలిసి కొన్నేళ్ళుగా తమిళనాడుతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నెల్లూరులోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో నెల్లూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వేలిముద్రలు పరిశీలించారు. వీరు చంద్రగిరి, పుత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి బంగారు నగలు అపహరించుకుని వెళ్ళారు. ఈనెల 15న ఏర్పేడు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటి ముందు నిలిపిన బైకును దొంగలించి నెల్లూరు వెళ్లారు. అక్కడ నవాబ్‌పేటలో ఇంటి ముందు ఆపి వున్న మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. ఈ రెండు మోటారు సైకిళ్లలో తిరుగుతూ పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం వేట మొదలు పెట్టారు.

క్రైం అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో..

పుత్తూరు, ఏర్పేడు, చంద్రగిరి, గాజులమండ్యం పరిధిలోని పెనుబాల కళాశాలలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో తిరుపతి క్రైం సీఐలు ప్రకాష్, శివకుమార్ రెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర, పుత్తూరు, కేవీబీ పురం, పిచ్చాటూరు ఎస్‌ఐలు ఓబయ్య, నరేష్, వెంకటేష్‌లతో పాటు జిల్లా క్రైం పార్టీలు దాము, నాగరాజు, రమేష్, మోహన్, రాజశేఖర్, భారుష, రవిప్రకాష్, మోహన్, మునిరత్నంను బృందాలుగా ఏర్పాటు చేశారు. వీరు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో బుధవారం పుత్తూరు- చెన్నై హైవేలోని సిరుగురాజుపాలెం సమీపంలో మురుగన్‌గుడి వద్ద నలుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.20.40 లక్షల విలువ చేసే 190 గ్రాముల బంగారు నగలు, 2.3 కిలోల వెండి వస్తువులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసుల్లో తమిళనాడు రాష్ట్రం చిదంబరానికి చెందిన ఎం.ప్రభు, వేలూరు జిల్లా అనైకట్టుకు చెందిన మణిగండన్ పరారీలో ఉన్నారు. కాగా, అరెస్టయిన వారిలో మణిపై 50, సురేష్‌పైన 15, కుమార్‌పై 18, మణికంఠపై 18 చొప్పున కేసులున్నాయి. ఈ కేసుల్లో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



పుత్తూరు పోలీసులు రికవరీ చేసిన నగలు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ

హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానాలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించిన పలు హోటళ్ల, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానా విధించినట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో ఓ ఐస్‌క్రీమ్ పార్లర్‌కు రూ.50వేలు, రెస్టారెంట్లు,దాబాలకు రూ.1.15లక్షలు, సరైన లేబుల్ వివరాలు లేకుండా వాటర్ బాటిల్ విక్రయించినందుకు రూ.30వేలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థకు రూ.30వేలు, నాణ్యత లేని నెయ్యి విక్రయించినందుకు రూ.15వేలు, ఓ బేకరికి రూ.15వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. వివిధ ఆయిల్ సాల్ట్ ప్యాకెట్‌పై వినియోగదారులను తప్పుదోవ పట్టించిన వివరాలు ముద్రించిన సంస్థకు రూ.2లక్షలు, కాలపరిమితి ముగిసిన ఆహారపదార్థలను ఉంచినందుకు వ్యాపారికి రూ.15వేలు, ఇలా 20 కేసులకు సంబంధించి 4.92లక్షలు జరిమానా విధించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అట్రాసిటీ కేసు విచారణ


బాధితులను విచారిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

చిట్టమూరు, జులై 30(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం కోగిలి రొయ్యల చెరువు వద్ద కాపలాదారుగా ఉన్న గిరిజనుడు సుధాకర్‌ను కులం పేరుతో దూషించి గాయపరిచిన ఘటనపై గూడూరు డీఎస్పీ గీతాకుమారి బుధవారం విచారణ జరిపారు. పోలీసుల కథనం మేరకు... రాఘవారిపాళెం గ్రామానికి చెందిన సుధాకర్ చిల్లమూరు సర్పంచు విజయల్‌రెడ్డికి కోగిలిలో ఉన్న రొయ్యల చెరువు వద్ద కాపలా ఉన్నాడు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం ఊరికెళ్లిన తన భార్యను తీసుకొచ్చేందుకు సుధాకర్ రొయ్యల చెరువు వద్దకు ఆటో పిలిపించుకున్నాడు. అదే సమయంలో విజయల్‌రెడ్డి వచ్చి ఆటోలో ఎక్కడికి వెళ్లిపోతున్నావంటూ సుధాకర్‌ను కులం పేరుతో దూషిస్తూ, దాడి చేశాడు. అంతేకాకుండా ఈశ్వరవాక గ్రామానికి తీసుకెళ్లి మరొక రొయ్యల చెరువు వద్ద నిర్బంధించినట్లు బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజయల్‌రెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బుధవారం గూడూరు డీఎస్పీ గీతా కుమారి బాధితులను, సాక్షులను విచారించారు. ఆమె వెంట ఎస్ఐ చిన్న బలరామయ్య ఉన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ-4 కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని స్త్రీశక్తి భవనంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1979 పేద కుటుంబాలను గుర్తించామని, ఇందులో 1548 మందిని దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే మండలంలో 97 ఉన్నత కుటుంబాలను గుర్తించి, 641 బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా మార్గదర్శకాలను రూపొందించడం జరిగిందన్నారు. ప్రవాస భారతీయులు, భూస్వాములు, ఆక్వా, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారికి పీ-4 కార్యక్రమం గురించి వివరించి నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునేలా కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


ఎమ్మెల్సీ బీద రవిచంద్రను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ చైర్మన్ నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను గూడూరు టీడీపీ నాయకులు సన్మానించారు. బుధవారం నెల్లూరులోని ఎమ్మెల్సీ నివాసంలో బీద రవిచంద్రను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, తక్కెళ్లపాటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలతో ఆంధ్రమహిళా మండలి సభ్యులు

గూడూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. బుధవారం స్థానిక సాయిబాబా మందిరంలో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో మాధురి, లక్ష్మి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు శ్రీరాములు

గూడూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భవననిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. ఈ సంక్షేమ బోర్డులోని రూ.12కోట్లు నిధులను దారిమళ్లించారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఆగస్టు 3,4,5 తేదీల్లో సూళ్లూరుపేటలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, రమేష్, సునీల్, మస్తాన్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు

రేణిగుంట జూలై 30(ఆంధ్రజ్యోతి): చెన్నై-గాజులమండ్యం నేషనల్ హైవే వద్ద ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం గాజులమండ్యం నేషనల్ హైవే పనుల్లో హైవే అధికారుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించారు. ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని స్థానికులకు హెచ్చరించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతిలో మిగులు సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు కోరారు.

జాతర నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

వెంకటగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో సెప్టెంబరు 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పోలేరమ్మ జాతరకు ఆగస్టు 5వ తేదీ టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేడు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

15 ఏళ్లుగా పైప్‌లైన్ మరమ్మతులు చేయని వైనం ● లక్షల రూపాయల వృధా

ఓజిలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపరియ పంచాయతీ పరిధి పెద్దపరియరాజుపాళెంలో 2009లో అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నిధుల నుంచి రూ.8 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించింది. గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు సమీపంలో ఓ బోరు వేసి దాని ద్వారా ట్యాంకుకు నీటిని నింపి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసేవారు. కొద్ది కాలానికే ట్యాంకుకు నీటిని అందించే పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. దానికి మరమ్మతులు చేయకుండా నేరుగా ఇళ్లకు నీటిని సరఫరా చేసేలా అప్పట్లో చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత కూడా పైప్‌లైన్‌ను బాగు చేయకుండా వదిలేశారు. దీంతో 15 ఏళ్లుగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తే ట్యాంకును నింపి ఇళ్లకు నీటి సరఫరా చేయొచ్చు. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు - పగిలిపోయిన పైప్‌లైన్

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ డాక్టర్ నాగార్జునసాగర్

పెళ్లకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట ఏడీఏ డాక్టర్ నాగార్జున సాగర్ కోరారు. బుధవారం మండలంలోని తాళ్వాయపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఎకరానికి రూ.198 చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా రైతులు తాము పండించే పంటల వివరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని, తద్వారా పంటల బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర, వ్యవసాయ రుణాలు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు తదితర పథకాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి విజయభారతి, ఏఈవో పుట్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

నాయుడుపేట టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం సంజయ్ గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రేస్ బుధవారం నిత్యావసర సరుకులను అందజేశారు. తన జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు బెన్నీ సునీత, పాస్టర్ దయాకర్, షర్మిలా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతిచెందిన షాహెరాభాను

గూడూరు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో బుధవారం ఓ మహిళ అనుమానాస్పద మృతి చెందింది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... ఇందిరమ్మ కాలనీలో నివాస ముంటున్న షాహెరాభాను(33) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేది. బుధవారం కాలనీ సమీపంలో షాహెరాభాను మృతి చెందివున్నట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆమె మృతికి కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు.

సర్పంచ్ ఔదార్యం

తాగునీటి బోరుకు సొంతఖర్చుతో మోటరు ఏర్పాటు


బోరుకు మోటర్ అమర్చుతున్న సర్పంచు కోటయ్య తదితరులు

చిట్టమూరు, జులై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరు కొత్తగుంట గ్రామంలో తాగునీటి బోరు మోటరు వారం రోజుల క్రితం కాలిపోయింది. దీంతో తాగునీరు అందక కొత్తగుంట గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్‌కు తెలియజేసినప్పటికీ స్పందించలేదు. దీంతో సర్పంచ్ కోటయ్య సొంత డబ్బులతో కొత్త మోటరు కొనుగోలు చేసి గ్రామస్థుల సహకారంతో బోరుకు అమర్చారు.

పులివర్తి లక్ష్మీభారతికి నివాళి


లక్ష్మీభారతికి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాళి అర్పించారు. పులివర్తిపాలెంలో బుధవారం జరిగిన సంతాపసభకు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

వరదయ్యపాళెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ సుధీర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కారిపాకంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా జీవించేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. చట్టం అతిక్రమించకుండా ప్రతి ఒక్కరు చట్ట పరిధిలో జీవించాలన్నారు. డివిజనల్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు ఆర్ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వికృతమాల జగనన్న కాలనీ

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వికృతమాల జగనన్న కాలనీ అంధకారంలో మగ్గుతోంది. ఈ కాలనీలో 900మందికి పట్టాలు ఇచ్చినప్పటికీ మూడిళ్లు మాత్రమే నిర్మించారు. ఇందులో వంద కుటుంబాల వరకు కాపురముంటున్నారు. వీరికి ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. దీంతో నానా అవస్థలు పడుతున్నారు. సీపీఐ మండల కార్యదర్శి శివకుమార్ బుధవారం సాయంత్రం జగనన్న కాలనీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత


గ్రీన్ ఇండియా సేవ్ ఇండియా కార్యక్రమంలో విద్యార్థులు

నాయుడుపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర అన్నారు. నాయుడుపేటలో బుధవారం గ్రీన్ ఇండియా.. సేవ్ ఇండియా నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గాంధీమందిరం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. విపరీతంగా పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని చెట్లు నియంత్రించగలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ఏవో సుధీర్, మురళీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా స్వామిత్వ సర్వే

కోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ భూ సర్వేను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఆగస్టు 1నుంచి మండలంలోని చెందోడు, కేశవరం, గూడలి, కోట, కొత్తపట్నం, సిద్దవరం, అల్లంపాడు, చిట్టేడు పంచాయతీల్లో భూములు, ఇంటి స్థలాలు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులతో పాటు డిజిటల్ అసిస్టెంట్‌లు, విలేజ్ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరించాలన్నారు.

గ్రామ కంఠం భూముల సర్వేపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ జనార్దన్

చిట్టమూరు, జులై 30(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి చేపట్టనున్న గ్రామ కంఠం భూముల సర్వేపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ జనార్దన్, మాస్టర్ ట్రైనర్ సర్వేయర్లు మహీధర్, గోవర్ధన్ శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి కృషి

ఏర్పేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విశాఖకు చెందిన మైత్రి ఇన్‌ఫ్రాక్చర్ మైనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తేల్ల బాలపవన్ పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఆయన గుడిమల్లం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో నిత్యాన్నదానానికి తమ వంతు ఆర్థిక సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈక్రమంలో బుధవారం విశాఖలోని సంస్థ కార్యాలయానికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు, వేద పండితులు పవన్ యోగేంద్రశర్మలు వెళ్లి బాలపవన్‌ను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. త్వరలో ఆలయానికి వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతానని బాలపవన్ వారికి చెప్పారు.

బడి మానేసిన పిల్లలకు కౌన్సెలింగ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. కాంపాళెం పంచాయతీలోని చలం వారి గిరిజనకాలనీలో బడి మానేసిన పదిమందితో ఆయన మాట్లాడారు. కిలోమీటరుపైన పొలాల్లో నడిచి వెళ్లాలంటే పిల్లలకు కష్టమని తల్లిదండ్రులు చెప్పారు. సమీపంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీకి ఆటో ద్వారా తీసుకువెళ్తామని ఆయన చెప్పడంతో అంగీకరించారు. పిల్లలకు అడ్మిషన్ కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి చెందండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను మహిళా సమాఖ్య సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. వెలుగు కార్యాలయంలో మహిళ సమాఖ్య సభ్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులో పరపతి పెంచుకోవాలన్నారు.

డి.వడ్డిపల్లి సర్పంచ్ చెంచమ్మ మృతి


చెంచమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఇన్‌సెట్లో ఫైల్‌ఫొటో

డక్కిలి, జులై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ వేపమాను చెంచమ్మ(65) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో చికిత్స కోసం చెన్నై తీసుకెళుతుంగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2013, 2021లో సర్పంచ్‌గా గెలుపొందిన చెంచమ్మ ప్రభుత్వ నిధులతో పాటు సొంత డబ్బులు ఖర్చుచేసి పంచాయతీలో సిమెంటు రోడ్లు వేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను ఆమే తీసుకొన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు కట్టించినందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి స్వచ్ఛ మహిళ చాంపియన్ అవార్డుకు ఎంపికయ్యారు. 2014లో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. చెంచమ్మ మృతి చెందారన్న విషయం తెలియగానే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. చెంచమ్మ మృతితో టీడీపీ మంచి మహిళా నాయకురాలిని కోల్పోయిందన్నారు. కాగా ఆయన తోటు పాటు డక్కిలి తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దందవోలు పెంచలరెడ్డి, మాజీ ఎంపీపీ వెలికంటి చెంచయ్య, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతమాను వెంకటపతి తదితరులు చెంచమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సులోచనారాణి

చిల్లకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండాలని న్యాయమూర్తి సులోచనారాణి అన్నారు. బుధవారం మండలంలోని అపెక్స్ పరిశ్రమలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినం కార్యక్రమాన్ని నిర్వహించి మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి హక్కులపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణా పెరిగిపోతోందని, వాటిని నియంత్రించే చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, ఎస్ఐ సురేష్‌బాబు, అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, పరిశ్రమ ప్రతినిధులు శైలజ, షరీఫ్, మోహన్ పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే


సబ్‌రిజిస్ట్రార్‌ను వివరాలడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అధికారులు అలసత్వం వీడాలని, ఫిర్యాదులు అందితే సహించేది లేదని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వివిధ సనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని సబ్‌రిజిస్ట్రార్ రూపవాణిని సూచించారు. కార్యాలయాన్ని ఇప్పటి అవసరాలకు తగినవిధంగా ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉదయం 10గంటల సమయంలో కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కార్యాలయంలో ఒక్క ఉద్యోగి మాత్రమే ఉండడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు.

క్వారీ వద్ద గిరిజనుల నిరసన

సత్యవేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చమర్తికండ్రిగ వద్ద క్వారీల అక్రమాలపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కంకర క్వారీల వద్ద గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ అటవీ సంపదపై ఆధారపడి జీవించే గిరిజనుల హక్కులను ఇక్కడి క్వారీల యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. వారి భూములు, ఇళ్ల స్థలాలు ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు అడవుల్లోకి వెళ్ళేందుకు దారి కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు చంద్ర, మురళి, ధనుంజయులు, గిరిజనులు పాల్గొన్నారు.

మునిరెడ్డికి నివాళి


మునిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఊరందూరులో బుధవారం జరిగిన అమాస మునిరెడ్డి కర్మక్రియల కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ హాజరయ్యారు. మునిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.